honeybee.org

సంపుటి 5 సంచిక 2 సెప్టెంబర్ - అంక్టోబర్ 2016

# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org










# ఎలా ఉన్నామో అలాగే ఉండాలి

# చిల్లుకుండ కథ



చాలాకాలం క్రితం ఒక కావడి మోసేవాడు రెండు పెద్ద కుండలని ఒక కర్రకి రెండువైపులా వేలాడగట్టి రోజూ ఏటినుండి యజమాని ఇంటికి నీరు మోసేవాడు. ఒక కుండకు చిల్లి ఉండటం వలన రోజూ అది సగం నీళ్ళు మాత్రమే తేగలిగేది. రెండో కుండ మాత్రం పూర్తి నీటిని చేరవేసేది.

రెండు సంవత్సరాలుగా ఇలా సాగింది. రోజూ కావడివాడు ఒకటిన్నర కుండల నీళ్ళు తన యజమానికి ఇంటికి చేరవేసేవాడు. పూర్తిగా నీళ్ళు తెచ్చే కుండకి తాను పూర్తి పని చేస్తున్నాను అని చాలా గర్వంగా ఉండేది. కానీ, సగం పని మాత్రమే చేస్తున్నానని చిల్లుకుండ మాత్రం తన అవిటి తనానికి సిగ్గుపడుతూ ఉండేది. ఇలా రెండేళ్ళు మథనపడిన తర్వాత చిల్లికుండ ఇక ఉండబట్టలేక కావడివాడితో అనేసింది. "నేను చాలా సిగ్గుపడుతున్నాను, దానికి క్షమాపణ అడగాల్సి వుంది" అంది. అందుకు కావడివాడు "ఎందుకు? నువ్వెందుకు సిగ్గుపడాలి?" అన్నాడు. "నాలోని చిల్లి కారణంగా గత రెండు సంవత్సరాలుగా నువ్వు యజమానికి పోస్తున్న నీళ్ళు త్రోవలోనే సగం కారిపోతున్నాయి. పాపం నువ్వు పూర్తిగా శ్రమించినా, ఫలితం మాత్రం పూర్తిగా దక్కటం లేదు" అన్నది.

కావడివాడు చిల్లుకుండని చూసి జాలిపడి "చూడు నువ్వొకసారి ఏటినుండి యజమాని ఇంటికి వెళ్ళే దారి చూవావా? చక్కని అందమైన రంగు రంగుల పూలతో కళకళలాడిపోతోంది" అని దాన్ని తీసుకెళ్ళి చూపించాడు. నిజమే దారిపొడవునా ఒకవైపు చక్కని పూలు నీరెండలో తళతళ లాడిపోతున్నాయి. అది చూసి చిల్లికండ కొంచెం ఊరట చెందినా తనవల్ల జరిగిన తప్పుకి నష్టానికి క్షమించమని కోరింది. అప్పుడు కావడివాడు "చూడు మనం వెళ్ళే తోవలో నువ్వు వెళ్ళేవైపునే పూలున్నాయి. రెండవ వైపు లేవు గమనించావా? నీలోం లోపం మందే నాకు తెలుసు. అందుకే నేను దాన్ని లాభసాటిగా మలచటానికి దారిపొడవునా నువ్వున్నవైపు రకరకాల విత్తనాలు చల్లాను. మనం ఆ దారివెంట వచ్చేటప్పుడు నీకు తెలియకుండానే నీరందించావు. గత రెండేళ్ళుగా నేనీ పూలను తీసుకెళ్ళి యజమాని ఇంట్లో మేజాపై అలంకరిస్తున్నాను. నువ్విలా ఉండబట్టే ఆయన ఇంట్లో మేజా అందంగా అలంకరించబడుతోంది. ఆయనా ఆనందించి నన్ను అభినందిస్తున్నాడు" అన్నాడు.

- హనీబీ 11(4) & 12 (1) - 2000-2001

సంపుటి-5 సంచిక - 2

# పల్లెసృజన

సెప్టెంబర్-అక్టోబర్ 2016

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్ సిద్ధు

## ఈ సంచికలో...


- 'పల్లెసృజన' 50 సంచికల సింహావలోకనం - 3
- అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు - 7
- స్ఫూర్తి విద్యాసంస్థ ప్రాంగణంలో 'జ్ఞానమార్పిడి'- 9
- సాంకేతికతను స్వంతం చేసుకున్న సాధారణ రైతు అమర్‌నాథ్ - 13
- అనంతపురం జిల్లాలో 20వ చిన్నశోధయాత్ర - 18
- తక్కువ ధరకే చెవిటి మిషన్ - 24
- అడవి పందుల నుండి పంటల రక్షణకు మార్గాలు-26
- గుజరాత్ రాష్ట్రంలోని పల్లెకబుర్లు - 28
- ప్రకృతి వైద్యం - సాంప్రదాయ వైద్యం - 30
- స్పందన - 32


కవర్ లోపలి పేజీల్లో ....
చిల్లుకుండ కథ-హనీబీ కథ,
రైతుల కోసం రైతులు తయారు చేసిన సేంద్రియ పురుగు మందులు
మధ్య పేజీలో :
'ఇగ్నైట్-2015' లో బహుమతి పొందిన చిన్నారుల ఆలోచనలు
ప్రతి పేజీలో అబ్దుల్ కలాం గారి సూక్తులు

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెసృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.

ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
president@pallesrujana.org

Visit at :
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed, Published and Owned by **Brig. Pogula Ganesham**, Chief Editor, Published from 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678 and Printed at **M/s Narendra Graphics**, 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904, Editor Sri **J. Sesimohan.**

# అడవి జంతువులు - రైతుల నష్టాలు

అడపా తడపా వచ్చినా ప్రకృతి వైపరీత్యాల కారణంగా వ్యవసాయంలో నష్టపోవడమన్న విషయం మనందరికీ తెలిసిందే. ఈమధ్య రైతులకు వ్యవసాయం సవ్యంగా జరగకుండా ఎన్నో అడ్డంకులు వస్తున్నాయి. ఇవన్నీ ప్రకృతివల్లే ఉత్పన్నమవుతున్నాయని చెప్పడం సబబు కాదేమో. అకాల వర్షాలు, పంటను నష్టం చేసే వింత పురుగులు, నకిలీ విత్తనాలు, మంచి ఫలితాలివ్వని రసాయన ఎరువులు, పురుగు మందులు, ఇలాంటివన్నీ రైతుకు ఏదోవిధంగా నష్టాన్ని చేకూరుస్తున్నాయి. వీటికి తోడు పారిశ్రామికవేత్తల స్వార్థాలు, దురాశ, కొంతవరకు రైతుల అజ్ఞానం, వ్యవసాయ శాస్త్రజ్ఞుల నిస్సహాయత, ప్రభుత్వ నిర్లక్ష్యం, విధాన నిర్ణయాల్లో లోపాలు, పాలనలో అవినీతి ఇవన్నీ రైతుల కష్టాలను ఇంకా పెంచుతున్నాయి.

ఇవే కాకుండా వ్యవస్థ, పాలకులు, పరిశ్రమలు రైతులకు చేస్తున్న నష్టాలకు జంతువులు కూడా తోడవుతున్నాయి. అడవి పందులు, కోతులు, జింకలు, ఏనుగులు మన తెలుగు రాష్ట్రాల్లో వీరవిహారం చేస్తున్నాయి. గత పది సంవత్సరాలుగా అడవి పందుల సమస్య పెరుగుతూ వస్తోంది. వీటిని ఎదుర్కొనే సరియైన పద్ధతి ఇంతవరకు రైతులకు చేరలేదు. అనేక గ్రామాల్లో రైతులు వారి క్రియాశీలతను ఉపయోగించి కొన్ని ప్రయోగాలు చేస్తున్నారు. వాటివల్ల పంటలను అడవి పందులనుండి తాత్కాలికంగా కొంత వరకు కాపాడుకోగల్గుతున్నారు. రాత్రుళ్ళు పొలంలో కాపలా ఉండటం, పొలం చుట్టూ భరించలేని వాసనలు ఉత్పత్తి చేసే ప్రక్రియలు, చీరలు పొలం చుట్టూ కట్టడం లాంటి అనేక స్థానిక పద్ధతులు రైతులు చేస్తుండగా, పరిశ్రమలు, సాంకేతికత ఉపయోగించి ధ్వనులు, కళ్ళు చెదిరే కాంతులు, షాకు కొట్టే కంచెలు, కత్తుల్లా వుండి పందులను గాయపరిచే వైరు కంచెలు.... ఇలా ఎన్నో మార్కెట్లోకి వస్తున్నాయి.

శోధయాత్రల్లో గ్రామ ప్రజలు జంతువుల వల్ల పంటలకు కలిగే నష్టాలను గురించి యాత్రీకులతో మనసు విప్పి చెప్పుకుంటారు. నిజామాబాద్ యాత్రలో రైతులు అడవి పందుల బారినుండి పంటను కావపాడటానికి చీరలు కడతారట. గుంటూరులో గంధకం, ఆముదముతో కలిపి సుతిలీ (పురికొస) దారానికి పూసి, దాన్ని కంచెలా పొలం చుట్టూ కడతారట. మహబూబ్‌నగర్ జిల్లాలో రాత్రి కాపలా ఎక్కువగా కాస్తారట. ఉత్తర భారతంలో కూడా పందుల బారినుండి పంటలను కాపాడటానికి ఎన్నో ప్రయోగాలను శోధయాత్రీకులు గమనించి గ్రంథస్థం చేయటం జరిగింది. ఇంతవరకు అడవి పందుల బారినుండి పంట రక్షణకై పల్లెసృజన సేకరించిన ప్రయోగాలన్నీ ఈ సంచికలో ప్రచురిస్తున్నాము. రైతులు వీటిని ఆచరణలో పెట్టి వాటి ఫలితాలు, మార్పులు, చేర్పులు, అనుభవాలను మాతో పంచుకుంటారని ఆశిస్తున్నాం.

కోతులు కూడా ప్రజలకు అపార నష్టాన్ని కలిగించడం, మెదక్, తూర్పుగోదావరి జిల్లాల్లో ఎక్కువగా అగుపించింది. తూర్పు గోదావరిలోని రంపచోడవరం ప్రాంతాల్లో కొన్ని గ్రామాల్లోని ప్రజలు కోతుల బెడదను తట్టుకోలేక తమ పొలాల్లో పంటలు పండించడమే మానుకున్నారు. జీడిమామిడి తోటల సంపాదనతో జీవితం గడుపుతున్నారు. జంతువుల ప్రమేయం రైతుల జీవన విధానాన్నే మారుస్తున్నదంటే అతిశయోక్తి కాదేమో.

కడప జిల్లాలో మరో వింత విషయాన్ని గ్రామస్తులు శోధయాత్రీకులతో పంచుకున్నారు. అడవికి దగ్గరగా ఒక పెద్ద సిమెంటు ఫ్యాక్టరీ రావడంతో వారు రోజూ పేల్చే చప్పుళ్ళకు భయపడి అడవి ప్రాంతంలో నివాసంగా ఉన్న జింకలు గ్రామాల్లోకి వచ్చేశాయి.. అవి చేలలో తిరిగి చాలా నష్టాన్ని కలిగిస్తున్నాయి. వాటికి నష్టం కలిగించడం చట్టవిరుద్ధం, కాని అవి చేసే నష్టాన్నించి పంటలను కాపాడుకోవడం రైతులకి ఒక పెద్ద సమస్య అయింది. ఇక్కడ కూడా రైతులు కొన్ని గ్రామాల్లో జింకలు, పందుల బాధ తట్టుకోలేక పంటలనే మార్చేస్తున్నారు.

జంతువులు పొలాల్లో స్వైర విహారం చేస్తుంటే రైతులు పంటలను స్వేచ్ఛగా, చక్కగా ఎలా పండిస్తారు? ఈ పరిస్థితి రానురాను పెరుగుతున్నదే తప్ప తగ్గే సచూనలు కనిపించడం లేదు. ఇప్పుడు కోతులు, అడవి పందులు, జింకలు, ఏనుగులు భవిష్యత్తు మరిన్నో ఇతర జంతువులు రైతుల జీవితాలలో వారి జీవన విధానంతో ఎలాంటి మార్పులకు కారణమౌతాయో అన్నది ఒక తీవ్రమైన సమస్యగా మారుతున్నది.

జంతువులు నివసించే అడవులను మనం అభివృద్ధి పేరిట నష్టం చేస్తే జంతువులు ఆహారం కోసం ఊళ్ళమీద పడుతున్నాయి. ఇది వాటి ప్రతి క్రియ. పంటలను జంతువుల బారినుండి కాపాడటానికి రైతులు, పరిశ్రమలు చేసే ఈ చర్యలు తాత్కాలికమే కాని, శాశ్వతంగా పరిష్కారం కాదు.

దేశవ్యాప్తంగా జంతువులు కల్గిస్తున్న పంట నష్టాలు, వాటివల్ల గ్రామస్తుల జీవన విధానంలో వస్తున్న మార్పులు, వాటి ప్రభావం ఇవన్నీ కూలంకషంగా చర్చించాలి. స్థానికంగానే కాక, జాతీయ స్థాయిలో కూడా చర్చలు, సూక్ష్మ పరిశీలన విస్తారంగా జరగాలి. అడవి జంతువులను అడవుల్లోకి ఎలాగైనా తిరిగి పంపడానికి అన్ని ప్రయత్నాలు చేయాలి. అదే ఈ సమస్యకు పరిష్కారం. ఎవరి ఇంట్లో వాళ్ళు ఉంటే నష్టం ఎవరికీ ఉండదు కదా!



సమస్య చిన్నగా ఉన్నప్పుడే నిర్మూలించడం సులభం. దాన్ని నిర్లక్ష్యం చేసి పెద్దగా పెరిగే వరకు వేచి చూసి ఆ తర్వాత ఆ సమస్యల వల్ల వచ్చే నష్టాలను గురించి గొడవ పెడుతూ పరిష్కారం చాలా కష్టం అని వాదిస్తూ కాలం గడిపే మన సమాజం, వ్యవస్థ కనీసం ఈ విషయంలోనైనా త్వరలో శాశ్వత పరిష్కార దిశలో ముందుకు అడుగు వేస్తుందని 'పల్లెసృజన' ఆశిస్తున్నది.

వర్షాకాలం చాలావరకు సుముఖంగా ఉందన్న ఆనందంతో రైతులు పంటలు పండించడంలో పూర్తిగా నిమగ్నమై ఉన్నారన్న సంతోషంతో...... పర్వదినాల శుభాకాంక్షలతో.....

సర్వేజనాః సుఖినోభవంతు

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం


**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**










# 'పల్లెసృజన' 50 సంచికల సింహావలోకనం

**- వీర రాఘవ రెడ్డి, ఉప సంపాదకులు**

**గత 50 సంచికలలో 'పల్లెసృజన' అందించిన జ్ఞానాన్ని ఒకసారి సింహావలోకనం చేసుకోవాలని, ఇంతవరకు ప్రచురించిన అంశాలను సూక్ష్మంగా ఇక్కడ పొందు పరుస్తున్నాము. పాఠకులు గమనించి, అవసరమైన పత్రికలను పల్లెసృజన కార్యాలయం నుండి పొందవచ్చు.**

**- ఎడిటర్**

**ప్రారంభ సంచిక 'మే-జులై-2006':**

**❀ నిప్పుల కుంపట్లుగా మారుతున్న నీటి కొట్లాటలు:**

నేడు వివిధ రాష్ట్రాలు, ముఖ్యంగా మన దక్షిణాది రాష్ట్రాల నీటి కొట్లాటలను 10 సంవత్సరాల ముందే అందించడం జరిగింది.

**❀ సేంద్రియ విధానమే ఉత్తమ సాధనం :**

నేడు దాదాపు దేశమంతటా విస్తృత ప్రచారం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 'సేంద్రియ విధానం' పై పల్లెసృజన 2006లోనే శంఖం పూరించింది.

**❀ సెంట్రిఫ్యూగల్ స్ప్రేయర్ తయారు చేసిన ఉప్పుతేళ్ళ కృష్ణ**

ప్రకాశం జిల్లా అనంతవరం గ్రామావాసి ఉప్పుతేళ్ళ కృష్ణ ఒక సెంట్రిఫ్యూగల్ స్ప్రేయర్‌ను రూపొందించాడు. విదేశీ స్ప్రేయర్లకన్నా సూక్ష్మరీతిలో ఇది మందును వెదజల్లుతుంది. దీనికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

**❀ మబ్బుచాటు ప్రభ – గ్రామీణ ప్రతిభ :**

గ్రామాల్లో ఎంతో ప్రతిభ దాగుందని 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్', 'పల్లెసృజన' ఎప్పటినుంచో తమ బాణిగా చేసుకుని, దాన్ని సమాజానికి అందించటానికి అహరహం కృషి సలుపుతునే ఉంది.

**❀ సైకిల్‌తో నడిచే నీటి పంపును నిర్మించిన విక్రమ్ రాథోడ్ :**

2006లోనే మన తెలుగు ఇన్నోవేటర్ విక్రమ్ రాథోడ్ తన పొలం ఎండిపోతుంటే చూడలేక, తనకున్న ఆర్థిక స్థోమతతో, సైకిల్‌తో నడిచే నీటి పంపును తయారు చేసుకుని తన పొలానికి నీరు పారించుకున్నాడు. ఈ ఇన్నోవేషన్‌కు ఆనాడే విక్రం రాథోడ్ రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతిని కూడా అందుకున్నాడు.

**ఆగస్టు - డిసెంబర్ - 2006 సంచిక:**

**❀ దోమల నిర్మూలనకు కారాకొల్లు గ్రామ యువకుల విశేష కృషి :**

చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీప గ్రామమైన 'కారాకొల్లు'కు చెందిన జి. చంద్రశేఖర్ బృందం తయారు చేసిన 'శ్రీశైలం'ను వెలుగులోకి తీసుకు రావటం జరిగింది. ఇది ఎన్నో కుటుంబాలలో నిత్యావసర ఔషధంగా మారిందనటంలో సందేహం లేదు. మధుమేహ వ్యాధిగ్రస్తుల

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**



గాయాలను సైతం అత్యంత తక్కువ సమయంలో నిర్మూలించటం ఒక యెత్తయితే, దోమ కాటుకు గురి కాకుండా ఉపయోగించే పైపూత మందుగా కూడా పని చేస్తోంది. ప్రస్తుతం ఇది మార్కెట్‌లో కూడా విడుదల చేయబడింది.

**❀ 'బ్రహ్మం' సృష్టి – గ్యాస్ సహాయంతో ఇస్త్రీ పెట్టె :**

బొగ్గు, కరెంటు ధరలు విపరీతంగా పెరిగి పోతున్న తరుణంలో 'బ్రహ్మం' రూపొందించిన గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టె ఎంతోమంది రజకులను, ఇస్త్రీ జీవనోపాధిగా కలవారిని ఆకట్టుకుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందేందుకు అనుకూలంగా ఉందని ప్రశంసలూ అందుకొంది. అయితే అనేక కారణాలవల్ల ఇది అనుకున్నంత గా సమాజానికి అందుబాటులోకి రాలేక పోయింది.

**జనవరి - మార్చి, 2007 :**

**❀ తెల్లకాంతి విప్లవకర్త నరసింహాచారి :**

కాలిపోయిన ట్యూబ్‌లైట్లను ఛోక్ సహాయం కూడా లేకుండా 60% తక్కువ ఖర్చుతో వెలిగించుకునే ఉపాయాన్ని కనుగొన్న నరసింహాచారి రూపొందించిన విధానం సమాజంలో అన్ని వర్గాల వారు ఎంతో అభినందించారు. ఈ ట్యూబ్ లైటు మూడు సంవత్సరాల పాటు వెలుగుతుంది.

**❀ 'మసిక' వ్యాధికి విరుగుడు కనుగొన్న ఆదివాసి కొర్రా కృష్ణారావు :**

మనుషులలో ముఖంపై గడ్డలు ఏర్పడే 'మసిక' అనే వ్యాధికి విరుగుడు కనుగొన్నాడు ఆదివాసి కొర్రా కృష్ణారావు. దానితో పాటు ఎన్నో రోగాలకు మందులను కనుగొన్న ఒక ప్రత్యేకమైన వ్యక్తి.

**❀ తెలుగు గ్రామీణ శాస్త్రవేత్తలకు జాతీయ పురస్కారాలు :**

నాలుగవ జాతీయ పునాది స్థాయి సాంకేతిక ఆవిష్కరణలు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీల్లో మన ఇన్నోవేటర్ ఉప్పుతేళ్ళ కృష్ణ రూపొందించిన స్ప్రేయర్‌కు నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా బహుమతి లభించింది. అబ్దుల్ కలాం గారు 5 నిమిషాలు కృష్ణ ఆవిష్కరణ గురించి విని ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారు.

**❀ బోరు బావులలో మోటార్‌ను సులువుగా పైకి తీసే బోరు జాక్ :**

నిజామాబాద్ జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన రమణారెడ్డి బోరు బావుల్లో మోటార్ పాడయిపోతే దానిని వెలికి తీయటానికి రైతులు పడే ఇబ్బందులను నివారించేందుకు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో బోరు బావిలోని మోటార్‌ను పైకి లాగేందుకు ఒక 'బోరు జాక్'ను రూపొందించి ఎంతోమంది రైతులకు లాభాలు చేకూర్చి, వారి ప్రశంసలను అందుకొన్నాడు.

**ఏప్రిల్ - జూన్ 2007 :**

**నిజామాబాద్ జిల్లాలో చిన్న శోధయాత్ర :**

ఏప్రిల్ 29 నుండి మే 1 వరకు నిజాబాద్ జిల్లాలో మొదటి శోధయాత్ర ప్రారంభించబడింది. పల్లెల్లో జ్ఞాన సేకరణ నిమిత్తమై ప్రారంభించిన ఈ శోధయాత్రలు ఒక గ్రామం నుండి మరో గ్రామానికి జ్ఞానాన్ని పంచడం, ఆయా గ్రామాల్లోని ఇన్నోవేటర్లను, సాంప్రదాయ జ్ఞానకర్తలను వెలికి తీసి వారి ఇన్నోవేషన్లను సమాజానికి వినియోగ పడేలా చేయాలన్న గొప్ప లక్ష్యంలో సాగుతున్న ఈ శోధయాత్రలు ఇప్పటివరకు 20 జరిగాయి.

**కారంచేడు ప్రదర్శన అనుభవాలు :**

పల్లెసృజన తన కార్యక్రమాలలో భాగంగా గ్రామీ ఇన్నోవేటర్ల సృజనలను ప్రదర్శించడం జరిగింది. కారంచేడులో నిర్వహించిన రైతు సదస్సులో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా నాటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రదర్శన శాలను తిలకించి 'పల్లెసృజన' చేస్తున్న వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు

**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.**



వచ్చి తెలుగు గ్రామీణుల ప్రతిభను ప్రపంచానికి చాటాలని ప్రోత్సహించారు.

**రాజమల్లు ప్రయోగంతో ప్రత్తి పంట సస్యరక్షణ :**

వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలంలోని గొర్లవీడు గ్రామానికి చెందిన రైతు కాటం రాజమల్లు 'విషముష్టి' పండ్లతో ఒక సేంద్రియ క్రిమి సంహారిణి తయారు చేసి తన ప్రత్తి పంటను తక్కువ ఖర్చుతో సస్యరక్షణ చేశారు.

**వాటర్ ప్యాకెట్స్ :**

ఇన్నోవేటర్ ఉప్పుతేళ్ళ కృష్ణ వర్షపునీటిని సంరక్షించుకునేందుకు ప్రతి గ్రామంలో అతి తక్కువ ఖర్చుతో, ఎక్కువ నీటిని సంరక్షించుకునేందుకు అనుగుణంగా 'వాటర్ ప్యాకెట్స్' నిర్మించుకోవాలనే వినూత్న నమూనాను పాఠకులను పరిచయం చేశాడు.

**పులిపిర్లకు సాంప్రదాయ వైద్యం :**

ఖమ్మం జిల్లాకు చెందిన మంచుకొండ శ్రీనివాస రావు కొందరు మనుషుల శరీరంపై వెలిసే పులిపిర్లను నిర్మూలించేందుకు జీడి మామిడితో వినూత్న ప్రయోగం చేసి కృతకృత్యుడయ్యాడు.

**ఇన్నోవేషన్ల వ్యాప్తికై 'స్టూడెంట్స్ క్లబ్స్' :**

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ నిర్మాణ కర్తలలో ఒకరైన ప్రొఫెసర్ అనిల్ గుప్తా హైదరాబాదు పర్యటనకు విచ్చేసిన సందర్భంగా 'పల్లెసృజన' ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని వివిధ ఇంజనీరింగ్, ఐటిటి కళాశాలల విద్యార్థులతో 'ఇన్నోవేషన్లను వ్యాప్తికై విద్యార్థుల క్లబ్బు'ను ఏర్పాటు చేయడమైనది.

**జులై - సెప్టెంబర్ 2007:**

**చంద్రశేఖర్ 'దోమల మందు'కు ఎన్.ఐ.ఎఫ్. అండ :**

చిత్తూరు జిల్లా కారాకొల్లు గ్రామానికి చెందిన యువకులు చంద్రశేఖర్ సారథ్యంలో తయారు చేసిన 'దోమల మందు' "శ్రీతైలం"కు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) అండగా నిలిచింది. ఎన్నో విధాలుగా పనిచేసే ఈ తైలాన్ని విస్తృతంగా తయారు చేసేందుకు చంద్రశేఖర్ బృందానికి ఎన్.ఐ.ఎఫ్. ఆర్థిక సహాయాన్ని అందించి, ప్రోత్సహించింది.

**రైతుల పాలిట వరం వెంకట కృష్ణుడు సృజనాత్మక సృష్టి 'సంజీవిని' :**

కర్నూలు జిల్లాకు చెందిన వెంకట కృష్ణుడు తాను పనిచేసిన క్రిమి సంహారక రసాయనాల సంస్థలో నుండి మనస్తాపంతో బయటకు వచ్చి ప్రకృతికి హాని కరిగించే క్రిమి సంహారకాలు కాకుండా రైతుకు, ప్రకృతికి మేలు చేసేలా క్రిమి సంహారక మందులు తయారు చేయాలన్న ఉద్దేశ్యంతో సేంద్రియ మందులను తయారు చేసి స్వయంగా మార్కెటింగ్ చేసి అందరి శ్రేయస్సును కోరుతూ ఎంతో అభివృద్ధిని సాధిస్తున్న వెంకటకృష్ణ కథనం.

**జనవరి - మార్చి 2008:**

**ఆసు మిషన్‌తో చేనేత కార్మికుల కష్టాలను కడతేర్చిన మల్లేశం**

ఆసు యంత్రం సృజన అంతరించి పోతున్న 'పోచం పల్లి చేనేత' రంగాన్ని పునరుజ్జీవింప జేసిందని నమ్ముతారు చేనేత కార్మికులు. పోచంపల్లి టై & డై పద్ధతికి జీవం పోసిన చింతకింది మల్లేశంకు దేశ విదేశాల్లో ఎనలేని ఖ్యాతిని లభించింది.

**ఏప్రిల్ - జూన్ 2008:**

**టైర్లకు గాలి కొట్టేందుకు అతి చిన్న మొబైల్ పంపు :**

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లుకు చెందిన డి.వి. రవికుమార్ తయారు చేసిన అతి చిన్న మొబైల్ గాలి పంపు వినూత్న ఒరవడిని దిద్దింది. ఎన్నో తరాలుగా ఒకే విధంగా వున్న గాలి పంపు స్వరూపాన్ని మార్చివేసింది.

**విశాఖ జిల్లాలో ఎన్.ఐ.ఎఫ్. 21వ శోధయాత్ర :**

విశాఖపట్టణం జిల్లాలోని అరకు ప్రాంతంలో జరిగిన 21వ శోధయాత్ర 'మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి

మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.

సాన బెడితే ఎలా రాణిస్తాయో, ఆవిధంగా మారుమూల గ్రామాలలోని వినూత్న పరిశోధనలు చేసి వివిధ సమస్యలకు పరిష్కారాలు కనిపెడుతున్న వారిని శోధించింది.

**జులై - సెప్టెంబర్ 2008 :**

**ఉపాధి హామీ పథకంలో మార్పు కావాలి :**

2008లోనే ఎన్.ఐ.ఎఫ్.కు చెందిన ప్రొఫెసర్ అనిల్ గుప్త చెప్పిన ఉపాధి హామీ పథకంలో మార్పులను ఇప్పుడు ప్రభుత్వాలకు జ్ఞానోదయమై ఈ ఆర్థిక సంవత్సరం నుండి రైతుకు అనుసంధానం చేయటం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయుక్తంగా మారుతున్నాయి.

**ఆలేరు నుండి అబ్దుల్ కలాం దాకా :**

లక్ష్మి ఆసు మిషన్ సృష్టికర్త చింతకింది మల్లేశం నల్గొండ జిల్లా ఆలేరు నుండి భారత రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం ప్రక్కన కూర్చుని తేనీటి విందును స్వీకరించిన ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు కావడం అతని జీవితంలో మరపురాని సంఘటనగా చెప్పుకోవచ్చు.



**అక్టోబర్ - డిసెంబర్ 2008 :**

**జపాన్ రైతు 'ఫ్యుకువోకా' వినూత్న వ్యవసాయం :**

జపాన్‌కు చెందిన ఫ్యుకువోకా అనే రైతు కనుగొన్న వినూత్న సహజ వ్యవసాయ పద్ధతులను తెలుగు ప్రజలకు అందించడం జరిగింది. ఈ పద్ధతిలో కొందరు రైతులు తమ వ్యవసాయ రంగంలో ప్రవేశ పెట్టడం ద్వారా మంచి ఫలితాలను సాధిస్తున్నారు.

**జనవరి - మార్చి 2009 :**

**ఊహలు గాలిపటాలైతే....?**

జీవనాధారం వెతుక్కుంటూ సికింద్రాబాద్‌కు వలస వచ్చిన కొత్త శ్రీనివాస్ చదివింది పదవ తరగతే.... ఊహల గాలిపటాలను ఎగురవేస్తూ వచ్చిన శ్రీనివాస్‌కు ఆ గాలిపటాలే జీవనాధారమయ్యాయి.

**సుస్థిర సేంద్రియ వ్యవసాయ పద్ధతులు :**

సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ అందించిన సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతుల కోసం అందించటం జరిగింది.

**పేటెంట్ గ్రహీత, ఆదివాసి విక్రం రాథోడ్ :**

బహుశా దేశంలోనే మొట్టమొదటి చదువు లేకపోయినా పేటెంట్ పొందిన ఆదివాసి విరకమ్ రాథోడ్ కావచ్చేమో. ఆయన తయారు చేసిన సైకిల్ నీటి పంపుకు ఎన్.ఐ.ఎఫ్, పల్లెసృజనల సహకారంతో పేటెంటు లభించింది. ●

## 21వ చిన్నశోధయాత్ర - జ్ఞాన యాత్ర

**9-11 డిసెంబర్, 2016 తేదీలలో**

**ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా జిల్లాలో జరుగుతుంది.**

**పాల్గొనదలచినవారు 'పల్లెసృజన' కార్యాలయాన్ని సంప్రదించ గలరు.**

**ఫోన్ : 040-27111959**

**వెబ్‌సైట్ : www.pallesrujana.org**

సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.

# రైతుల కొరకు రైతులు తయారు చేసిన
# అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు
## అధిక దిగుబడినిచ్చే బల్వాన్ ఉల్లి రకం



**ఆవిర్భావం :**

హర్యానాలో గత ఎన్నో సంవత్సరాలుగా బల్వంత్ సింగ్ ఉల్లిగడ్డను పండిస్తూ వుండేవాడు. దిగుబడి సరిగ్గా రాని కారణంగా దిగుబడిని పెంచేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. స్థానికంగా లభించే రకాలలో మంచి రకాన్ని సేకరించి, అనేక ప్రయత్నాలు చేసి, పది సంవత్సరాల సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత చివరికి 1984లో ఒక రకాన్ని స్థిరీకరించి, దానికి 'బల్వాన్ ఉల్లి రకం' అని నామకరణం చేశాడు. స్థిరీకరించడానికి అతను ఉపయోగించిన ముఖ్య సూత్రాలు మూడు. 1. ఉల్లిగడ్డ పెద్ద సైజులో ఉండాలి, 2. పైపొర త్వరగా తీయటానికి రాకుండా ఉండాలి. (త్వరగా ఎండిపోకుండా ఉండేందుకు), 3. మంచి ఎర్రని రంగు కలిగి వుండాలి.

**ప్రత్యేక లక్షణాలు :**

- పై పొర గట్టిగా గడ్డను అతుక్కొని ఉండటం వలన లోపలి పొరలు త్వరగా ఎండిపోవు.
- లోపలి పొరలు మందంగా ఉంటాయి.
- గడ్డ ఏకాండంగా వుంటుంది. భాగాలుగా ఉండదు.
- కాండం కుళ్ళు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొంటుంది.
- 98% వరకు మొలకెత్తుతాయి.

**వాతావరణ అనుకూలత :**

చల్లటి వాతావరణం అనుకూలం. (సమతల వాతావరణం) వార్షిక వర్షపాతం 750 నుండి 1000 మి.మీ. చాలు.

**ఇతర లక్షణాలు :**

ఒక యేడాది వరకు గడ్డలను నిల్వ చేసుకోవచ్చు. నిర్ణీత కాలంలో వేసుకునే పంట.

**ధర :** కిలో విత్తనాలు రూ. 5,000/- (ఎకరాకు 2కిలోలు అవసరమౌతుంది).

**దిగుబడి :** ఎకరాకు 200 క్వింటాళ్ళ వరకు దిగుబడినిస్తుంది.

**విత్తే సమయం :** జులై నుండి ఫిబ్రవరి వరకు అనుకూలం.

**పంట కాలం :** 140-145 రోజులు.

**ఇన్నోవేటర్ :** బల్వాన్ సింగ్, హర్యానా, ఫోన్ : 9992696963

**బ్యాంకు అకౌంటు వివరాలు :** పంజాబ్ నేషనల్ బ్యాంక్, భవాని ఖాత్రా, హర్యానా, అకౌంట్ నెం. : 3297000100053334, ఐఎఫ్ఎస్ కోడ్ : పిఎన్‌బిఓ 329700.

కష్టాల సారాంశమే విజయం.

# చంద్రప్రభ 'రెయిన్ గన్'



**నీటి సమస్యకు పరిష్కారం :**

పొలాలకు నీరు పెట్టడం అన్నది చాలా క్లిష్టమైన సమస్య. కొన్ని స్వల్పకాలిక పరిష్కార మార్గాలు వున్నా అవి ఖర్చుతో కూడుకున్నవి. దీర్ఘకాలిక సమస్యా పరిష్కార మార్గాలన్నింటికి చాలా సమయం పడుతుంది. కాలువల ద్వారా నీరు పారించటానికి చాలా నీరు అవసరమౌతుంది. ఈ సమస్యలకి అనువైన పరిష్కార మార్గమే 'చంద్రప్రభ రెయిన్ గన్'. తగినంత నీటినే వాడటానికి చాలా ఉపయోగ పడుతుంది.

**పనిచేసే విధానం :**

చుట్టూ తిరిగే స్ప్రింక్లర్ కి ఒక పైపు ద్వారా నీటిని అందించే సదుపాయం కల్గించి, పొలానికి ఎంత నీరు అవసరమో దానికి తగిన నాజిల్స్‌ను ఏర్పరచుకొనే సదుపాయ ఈ రెయిన్ గన్‌కు వుంది.





**సాంకేతిక వివరాలు :**

❀ రకాన్ని బట్టి 5 నుండి 15 హార్స్‌పవర్ మోటారు (1440 ఆర్‌పిఎం)

❀ క్యాస్ట్ ఇనుముతో తయారైనది.

❀ వేగ నియంత్రణకు గేర్ల సదుపాయం.

**ముఖ్యాంశాలు :**

❀ స్థిరంగా ఏర్పరచుకొని, నీరు వృధా కాకుండా ఎక్కడ అవసరమో, అక్కడికే నీటిని వెదజల్లేల సదుపాయం.

❀ ఒక ఎకరా పొలం తడపటానికి గంటన్నర సమయం చాలు.

❀ 200 అడుగుల వ్యాసంలో పొలాన్ని తడుపుతుంది.

❀ మూడు అంగుళాల పైపుకి పెద్ద కన్నం వున్న నాజిల్ ఏర్పాటు చేయటం వలన దీనితో నీటితో పాటు ఎరువులు, క్రిమి సంహారక మందులు కూడా పిచికారి చేసుకోవచ్చు.

❀ నీరు అధిక వత్తిడితో వెదజల్లుతుంది కనుక గాలి ఆధారిత, ఎగిరే తెల్ల దోమ లాంటి చీడలు కొట్టుకుపోతాయి.

**పురస్కారాలు :**

2001లో ఎన్.ఐ.ఎఫ్. వారి మొదటి ద్వైవార్షిక గ్రామస్థాయి ఇన్నోవేషన్‌లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో రాష్ట్రపతి పురస్కారం అందుకొన్నాడు.

**ఇన్నోవేటర్ పేరు :** అన్నాసాహెబ్ భావు ఉద్గావి, కర్నాటక.

**పేటెంట్ అప్లికేషన్ నెం. :** 2719సిహెచ్.ఇ./2011

ఫోన్ :8496953375 / 9342212732

# స్ఫూర్తి విద్యాసంస్థ ప్రాంగణంలో 'జ్ఞాన మార్పిడి'




- నూకల అఖిల

సమకాలీన పరిస్థితుల్లో అనుభవపూర్వక జ్ఞానం యొక్క ప్రాముఖ్యతను గురించి ప్రతి విద్యాసంస్థ దృష్టికి తీసుకు రావటం జరుగుతునే వుంది. 'స్ఫూర్తి కళాశాల' యాజమాన్యం ఈ విషయంపై స్పందించి, 'నిజమైన సమస్యలు - వాటి పరిష్కార మార్గాలు' మూడు రకాల గుంపుల మధ్య అంటే విద్యార్థులు, ఇన్నోవేటర్లు మరియు గ్రామస్తులు కలిసి ఒకచోట కూర్చుని చర్చిస్తే అత్యధిక ప్రమాణంలో జ్ఞాన మార్పిడి జరిగే అవకాశం వుంటుందన్న నమ్మకం ఏర్పడింది. దీన్ని ఆచరణలో పెట్టాలన్న సత్సంకల్పంతో గ్రామ స్థాయిలోని సృజనాత్మకతను వెలుగులోకి తేవటానికి అవిరామ కృషి చేస్తున్న లాభాపేక్ష లేని సంస్థ అయిన 'పల్లెసృజన'ను సంప్రదించడం జరిగింది.

పర్యవసానంగా 17 సెప్టెంబర్, 2016 నాడు కళాశాల ప్రాంగణంలో 8 మంది ఇన్నోవేటర్లు, 17 ఇన్నోవేషన్లు, గ్రామస్తులు, అన్ని శాఖల్లోని విద్యార్థులు, వారి అధ్యాపకులు పాల్గొనేలా ఒక 'జ్ఞాన ప్రదర్శన'ను ఏర్పాటు చేయటం జరిగింది. రెండవ వ్యక్తి ప్రమేయం లేకుండా పాల్గొన్న వారంతా ఒకరితో ఒకరు ముఖాముఖి మాట్లాడుకొని, చర్చించి, జ్ఞాన మార్పిడి చేసుకోవటంతో రోజంతా జ్ఞానానికి సంబంధించి పండుగ వాతావరణం ఏర్పడింది. ఈ పండుగలో పాల్గొన్న మూడు గుంపుల దృక్పథం నుంచి ఆలోచిద్దాం.

**విద్యార్థులు:**తమ కళ్ళముందు ఒక అద్భుతం జరుగుతున్నట్లు అలా చూస్తూ ఉండిపోయారు. వారు తమ నిత్య జీవితంలో కాని, కళాశాల పాఠాలలో కాని చూడని, చెప్పని అనేక విషయాలు తెలుసుకుంటున్న భావనకు లోనయ్యారు. పాఠశాల చదువును వదిలేసిన వారు, అసలు చదువుకోని వారు, పాఠశాలలో చదువుకొని కళాశాలలకు వెళ్ళని వారు

**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**





సమాజంలో దిగువ స్థాయిలో వున్న 40 శాతం మంది వ్యక్తుల సమస్యలను తీర్చటానికి, అదీ వాళ్ళ సమస్యలను పూర్తిగా విశ్లేషించి, పరిష్కార మార్గంగా వారు చూపిన అతి తక్కువ ఖర్చుతో స్థానికంగా లభించే పరికరాలతో తక్కువ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నలుగురూ 'భేష్' అనే విధంగా ఎక్కువ ఫలితాన్నిచ్చే పరిష్కార మార్గాలు, పద్ధతులు, యంత్రాల వివరాలను తెలుసుకొని విద్యార్థులు అవాక్కయి పోయారు. విద్యార్థులు సమస్యలున్నవారు, (గ్రామస్తులు), పరిష్కారాలు చూపేవారు (ఇన్నోవేటర్లు) ముఖాముఖి మాట్లాడుకోవటం, చర్చించుకోవటం, సంప్రదించుకోవటం, బేరాలాడుకోవటం, సలహాలు తీసుకోవటం...... ఈ ప్రక్రియని చాలా ఆసక్తిగా గమనించారు. ప్రతి ఇన్నోవేషన్ వెనక వున్న కథని తెలుసుకున్నపుడు వారికి "అవసరమే కల్పనలకు మూలము" అన్న నానుడి పూర్తిగా అర్థమైంది. ప్రతి ఇన్నోవేషన్ వెనక వున్న శ్రమ, దీక్ష, పట్టుదల గురించి వింటూవుంటే వారికి 'కష్టాల నుంచే ఇన్నోవేషన్లు పుట్టుకొస్తాయని, కష్టపడితేనే ఇన్నోవేటర్‌గా తయారవుతాడని' తెలిసి వచ్చింది. ఇన్నోవేటర్లను ప్రత్యక్షంగా తమ కళ్ళముందు చూడటం, తమ కళాశాల ప్రాంగణంలో కలసి చర్చించడం ఒక అద్భుతంగా మరచిపోని సంఘటనగా విద్యార్థులు అనుభూతి పొందారు.

**ఇన్నోవేటర్లు :** హాజరైన జనాలు తమచుట్టూ చేరి తమ ఇన్నోవేషన్ల గురించి, అవి ఎందుకు, ఏవిధంగా తయారు చేయబడ్డాయో తెలుసుకోవటానికి చూపించిన ఉత్సాహంతో ఇన్నోవేటర్ల హృదయాలు సంతోసంతో, సంతృప్తితో నిండిపోయాయి. నిజమే మరి, ఆరోజుకు వారే హీరోలు, ముఖ్య అతిథులు. తమ కథల్లో ముఖ్య భూమిక వారిదే కదా! ఆరోజు వారు అధ్యాపకులై పోగా, మిగిలిన వారంతా కాలేజి అధ్యాపకులు, ప్రిన్సిపాల్, సంస్థ ఛైర్మన్, విద్యార్థులు అంతా విద్యార్థులు అయిపోయారు. రోజంతా నిర్విరామంగా చర్చిస్తున్నా, వారు అలసిపోవటం మాట అటుంచి, వారి శక్తి ద్విగుణీకృతం అయిందని చెప్పారు. వారిలో కొందరికి ఒక ఇంజనీరింగ్ కళాశాలకు రావటం అదే ప్రథమం. కొందరు ఇంజనీర్ అవ్వాలని కాలేకపోయిన వారు, అందరు కూడా ఆరోజు ఇంజనీర్ టీచర్లయిపోయారు. తమ ఇన్నోవేషన్లు బయట దొరికే వస్తువులకన్నా ఎక్కువ మెప్పు పొందడంతో వారి పెదాలపై చిరునవ్వు గర్వంగా వుండి, వారి ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. ఆరోజు పూర్తయ్యేసరికి వారి జ్ఞానము, నమ్మకము జీవితంలో ఏదో సాధించామన్న తృప్తి





**ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.**



ఎన్నోరెట్లు పెరిగాయన్న భావన కలిగింది వారిలో.

**గ్రామస్తులు :** సూటు, బూటు వేసుకున్న వ్యక్తులకన్నా, ఆ ఖరీదైన వసతులున్న భవన ప్రాంగణంలో సాధారణ బట్టలతో మామూలుగా వున్నా, గ్రామస్తులకి ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వటంతో వారు చాలా ఆనంద పడిపోయారు. ఉత్సవానికి హాజరైన ఇన్నోవేటర్లందరూ తమ వర్గానికి చెందినవారేనని తెలుసుకోవటంతో మరింత గర్వపడ్డారు. వారిద్దరి మధ్య సహజసిద్ధమైన బంధం ఏర్పడింది. గ్రామస్తులు తమ సమస్యలకి తమలాంటి వాళ్ళే పరిష్కారాలు కనుగొన్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఒకరిపై ఒకరికి పూర్తి నమ్మకం ఏర్పడి, చక్కటి వాతావరణంలో క్రియాశీలక సంభాషణలు జరిగి అనేక పాత, కొత్త సమస్యలు, వాటి పరిష్కార మార్గాల గురించి చర్చించుకున్నారు. తమలాంటి వ్యక్తులే ఇన్నోవేటర్లుగా మారారని తెలుసుకుని, తాము కూడా తమ సమస్యలకి కొత్త పరిష్కార మార్గాలను తమ పరిధిలో, తమ తాహతుకు మించకుండా, తమ వవారు, తమ గ్రామస్తులు మెచ్చుకునే విధంగా రూపకల్పన చేసుకోవచ్చునన్న దిశలో ప్రేరేపించబడ్డారు.

పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్తూ..... ఈ ప్రదర్శనలో



తాము నేర్చుకున్న జ్ఞానాన్ని చుట్టుప్రక్కల వారికి, గ్రామస్తులకి, స్నేహితులకి తప్పకుండా చెప్పాలి అని నిర్ణయించుకున్నారు.

**కళాశాల యాజమాన్యం :** 'పల్లెసృజన' సంస్థ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తీరుతో, కళాశాల యాజమాన్యం పూర్తి సంతృప్తి వ్యక్తం చేసింది. ఏ పుస్తకాలూ చదువుకోకుండా, కేవలం ప్రకృతి నుంచి, లేదా తమ దైనందిక కార్యక్రమాల లోనుంచి సంపాదించుకున్న జ్ఞానంతో రూపొందించిన అనేక ఇన్నోవేషన్లను తయారు చేసిన ఇన్నోవేటర్ల ప్రజ్ఞకి స్థానువులు అయిపోయారు. ఒక దశలో తమ ముందున్న ఇన్నోవేటర్లు తమకన్నా ఎంతో చదువుకున్న వాళ్ళు, గొప్ప వాళ్ళు అనిపించింది వారికి. భవిష్యత్‌లో కూడా ఇటువంటి కార్యక్రమాలు ఇంకా ఎక్కువ మంది ఇన్నోవేటర్లతో, ఇన్నోవేషన్లతో నిర్వహించి, జ్ఞాన మార్పిడికి తోడ్పడాలని నిశ్చయించుకున్నారు.

**పల్లెసృజన :** వివిధ వర్గాలకు చెందిన, వేర్వేరు వయస్సుల వారు, వేర్వేరు జీవన విధానం కలిగిన వ్యక్తుల మధ్య పారదర్శకంగా జ్ఞాన మార్పిడి జరగటానికి నిర్వహించబడ్డ ఈ కార్యక్రమం లో తమ పాత్రపై ఎంతో సంతృప్తి వ్యక్తం చేసింది. ఒక ప్రముఖ విద్యాసంస్థ ఇటువంటి కార్యక్రమం నిర్వహించ టానికి నడుం కట్టడం ఎంతో ఆనంద దాయకమైన విషయం. ఈ కార్యక్రమం యొక్క ఫలితాలపై 'పల్లెసృజన' సంస్థ పూర్తి సంతృప్తి, ఆనందం వ్యక్తం చేస్తూ 'తమ సభ్యులు ఇటువంటి అనేక జ్ఞాన మార్పిడి సంబంధ కార్యక్రమాలు చేయటానికి స్ఫూర్తినిచ్చింది' అన్న భావం ప్రకటించింది. వాలంటీర్ల సంపూర్ణ సహకారమే ఈ కార్యక్రమానికి ఊపిరని, వారిని కొనియాడింది. ●

**విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

## స్వయం ప్రతిపత్తిగల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము

# జాతీయ 10వ ద్వైవార్షిక పోటీలు

## పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.), 10వ ద్వైవార్షిక పోటీలకై మనదేశం నలుమూలల్లో పునాది స్థాయిలో దాగివున్న సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చేందుకు ఎన్.ఐ.ఎఫ్. కృషి చేస్తోంది. కర్షకులు, కార్మికులు, జాలరివారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, మురికి వాడలలో నివసించువారు, మహిళలు, విద్యార్థులు మరియు సమాజంలోని ఎవరైనను ఈ పోటీలో పాల్గొనవచ్చును. మీయొక్క ఆవిష్కరణలు వ్యవసాయము (పనిముట్లు, యంత్రములు, క్రొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలగునవి), గృహోపకరణాలు, రవాణా, ఎనర్జి (శక్తి) ఉత్పత్తి/పరిరక్షణ, పనిభారం తగ్గించటం, మూలికా వైద్యము (మానవ మరియు జంతు సంబంధమైన) మొదలగువాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని ఎక్కువ కాలం మనగలిగి పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆవిష్కరణలు మీ సొంత సృజనతో ఎటువంటి సాంకేతిక మద్దతు, పర్యవేక్షణ లేకుండా సహాయం/ గుర్తింపు పొందనివై ఉండాలి. మహిళలు మరియు వికలాంగుల యొక్క ఆవిష్కరణలు/ సంప్రదాయ విజ్ఞానానికి ప్రత్యేక బహుమతులు ఇవ్వబడతాయి. చిన్నపిల్లలను (స్కూల్‌కి వెళ్ళేవారు మరియు వెళ్ళనివారు) వారియొక్క సొంత ఆలోచనలను (Original Ideas) పంపమని ప్రోత్సహిస్తున్నాము. సాంకేతిక ఆవిష్కరణలకు సంబంధించిన నమూనాలు (Prototypes), అభివృద్ధి చేయని సృజనాత్మక ఆలోచనలను (Creative ideas) కూడా ఆహ్వానిస్తున్నాము.

వివిధ కేటగిరీలలో బహుమతి ఒక్కటికి రూ. 10,000 నుండి రూ. 7,50,000 వరకు ఉంటుంది. జీవిత కాలపు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందిన వారికి బహుమతి మొత్తంలో కొంత భాగాన్ని ఉపకార వేతనము (Fellowship) రూపములో (జీవిత కాలపు పురస్కారం పొందిన వారికి 5 సంవత్సరాలు, జాతీయ మొదటి, రెండవ, మూడవ పురస్కారాలు పొందినవారికి వరుసగా 3 సంవత్సరాలు, 2 సంవత్సరాలు, 1 సంవత్సరము) ఇస్తారు. మొత్తము బహుమతిలో పదిహేను శాతం (15%)ను ఆవిష్కరణకర్త(లు) వారి సమాజ సంక్షేమానికి మరియు ప్రకృతికిసంబంధించిన కార్యక్రమాలలో వినియోగించవలసి ఉంటుంది.

పునాది స్థాయిలో ఆవిష్కరణలను మరియు సంప్రదాయ విజ్ఞానాన్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులకు, సంస్థలకు విలేఖరులకు మరియు ప్రజల యొక్క విజ్ఞానానికి/సృజనాత్మకతకు విలువను జోడించి ప్రభావితం చేస్తున్న నిపుణులకు **ప్రత్యేక గుర్తింపు** ఉంటుంది. వ్యక్తులు లేదా సంస్థలు వారి ఆవిష్కరణలు ఎన్నయినా **31 మార్చి, 2017** లోగా మాకు చేరేలా పంపండి.

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation-India, Satellite Complex,**
**Premchand Nagar Road, Ahmedabad -380 015, Gujarat**
**Phone: (079) 26732456, 2095, Fax: (079) 26731903,**
**Email: campaign@nifindia.org,**
**Website: www.nif.org.in**

**గమనిక :** వృత్తిపరమైన నేపథ్యం/ అనుభవం ఉన్నవారు మరియు వృత్తివిద్యా కోర్సులలో ఉన్న విద్యార్థులు ఆవిష్కరణలు / ప్రతిపాదనలు పంపుటకు అర్హులు కారు. అయితే పునాది స్థాయిలో ఆవిష్కరణలకు విలువను జోడించుటకు వారి సేవలను ఎన్.ఐ.ఎఫ్. ఆహ్వానిస్తోంది. అర్హతలు మరియు సూచనలకు సంబంధించి మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ **http://www.nif.org.in/announcement**.చూడండి.

**దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.**

# సాంకేతికతను స్వంతం చేసుకున్న సాధారణ రైతు అమర్‌నాథ్




పెద్ద పెద్ద ఇంజనీర్లు కూడా ఆలోచించలేని సమస్యలను, ఏమాత్రం సాంకేతిక పరిజ్ఞానం, పెద్ద చదువు లేని మారుమూల గ్రామానికి చెందిన యువ రైతు తన మేథాశక్తితో తోటి రైతుల కష్టాలను తక్కువ ఖర్చుతో దూరం చేసేందుకు, నిత్య జీవితంలో వినియోగించే సాధారణ పరికరాలతోనే ఎన్నో ఇన్నోవేషన్లకు రూపకల్పన చేస్తున్నాడు అమర్‌నాథ్. అనంతపురం జిల్లా, కనగానపల్లి మండలంలోని మద్దుల చెరువు గ్రామానికి చెందిన ముత్యాలప్ప కుమారుడు అమర్‌నాథ్ కేవలం 6వ తరగతి వరకు చదివి, ఇటీవలే 10వ తరగతి ప్రైవేటుగా వ్రాసి ఉత్తీర్ణుడయ్యాడు. సరియైన ఆలోచనతో చెయ్యాలనుకున్న పనికి తెలివి వుంటే చాలు, పెద్ద పెద్ద చదువులు అవసరం లేదని నిరూపించాడు.

తనకున్న 4 ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగు చేస్తున్నాడు. అయితే వీరి భూమి కొండ ప్రాంతంలో ఉండటం వల్ల రాత్రిపూట కరెంటు వచ్చినపుడు వెళ్ళి మోటార్‌ను ఆన్ చేసి రావాలంటే వన్య మృగాల బెదడ ఎక్కువగా ఉండటంతో చాలా ఇబ్బందులు పడేవాడు. ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని, దీనివల్ల తాను మాత్రమే కాదు తన తోటి రైతాంగం కూడా ఎంతో బాగు పడుతుందని ఆలోచించి, సెల్‌ఫోన్‌తో మోటార్ స్టార్ట్ అయ్యేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు.

ఇందుకోసం స్టార్టర్ పెట్టెలో ఒక సెల్‌ఫోన్ అమర్చి, అందులోని కొన్ని భాగాలను స్టార్టర్‌కు అనుసంధానం చేసి తనవద్దనున్న సెల్‌ఫోన్‌తో మెసేజ్ పంపటం ద్వారా మోటార్‌ను స్టార్ట్ చేయటం జరిగింది. దీని తయారీకి కేవలం రూ. 2,500/– ఖర్చయ్యాయి అన్నాడు అమర్‌నాథ్. ఇతను తయారు చేసిన ఈ పరికరం చూసిన తోటి రైతాంగం ఎంతో

**నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.**



పైపులైను కొరకు గొయ్యి త్రవ్వి, పైపు వేసి, మళ్ళీ గోతిని పూడ్చే యంత్రం నమూనా

అభినందించారు. రైతుల కష్టాలకు తక్కువ ఖర్చుతో నివారణోపాయం కనుగొని అందరిచేత 'శహభాష్' అనిపించుకున్నాడు అమర్‌నాథ్. పొలంలో నీరు పారే విధానాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు సిసి టీవిని కూడా తయారు చేయాలని ఆలోచిస్తున్నాడు అమర్‌నాథ్.


ప్రస్తుతం రైతాంగం తమ పొలాలకు నీరు పారించుకునేందుకు పైప్‌లైన్ నిర్మాణం అత్యంత ఖరీదైన అంశం. ఈ పైపులను అమర్చటానికి ముందుగా మూడు అడుగుల లోతు పొడవాటి గొయ్యి త్రవ్వాలి. ఇందుకు అయ్యే కూలీల ఖర్చును ప్రస్తుతం రైతు భరించే స్థితిలో లేడు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇప్పుడు జెసిబిలు అందుబాటులోకి రావటం వల్ల రైతుకు కొంత ఊరట లభించింది. ఆ ఖర్చుకన్నా కూడా తక్కువ ఖర్చులో పైపులైను గొయ్యి త్రవ్వటం, పైపులు వేసిన తర్వాత మళ్ళీ ఆ గొయ్యిని పూడ్చటానికి ఒక 'టాటా ఏస్' వాహనానికి అనువైన పరికరాలను బిగించి ఏర్పాటు చేస్తాను అంటున్నాడు అమర్‌నాథ్.

తన పొలంలో 140 మామిడి చెట్లు, 100 సపోట చెట్లు ఉన్నాయి. సపోట చెట్లు తన పొలం ప్రక్కనే వున్న వంకకు సమీపంలో ఉండటం వల్ల వర్షం వచిచనపుడు నీరు వచ్చి చేరుతుంది. తన పొలం చౌడు నేల కావటం వల్ల చాలా రోజుల వరకు నీరు ఇంకిపోదు. అందువల్ల చాలా చెట్లు చనిపోవటం జరుగుతోంది. దీన్ని ఎలాగైనా నివారించాలని ఒక ఉపాయాన్ని ఆలోచించాడు అమర్‌నాథ్.

ప్రస్తుతం విదేశాల్లో మాత్రమే పెద్ద పెద్ద వృక్షాలను ఒక చోటనుంచి పెకలించి మరోచోట దాన్ని నాటే విధానానికి అనువైన యంత్రాలు ఉన్నాయి. అంత ఖరీదైన యంత్రాలు మనం భరించే స్థితిలో లేము కాబట్టి ఒక జెసిబి లాంటి చెట్లను పెకలించి, వేరేచోట నాటే యంత్రానికి నమూనా తయారు చేసుకున్నాడు. ఇది తయారు చేయగలిగితే చాలా మంది రైతాంగం తమ తోటల్లో అక్కడక్కడా ఉన్న చెట్ల వల్ల ఎక్కువ పొలం నష్టపోకుండా, చెట్లనన్నిటిని ఒకేచోట నాట గలిగితే ఎంతో పొలం ఉపయోగంలోకి వస్తుంది. అంతే కాకుండా రోడ్ల వెడల్పు కార్యక్రమాల్లో, విద్యుత్ తీగలకు ఇబ్బంది కలుగుతుందని చెట్లను కొట్టివేస్తున్న చోట కూడా ఈ యంత్రం ఉపయోగం వల్ల చెట్లు కొట్టివేయవలసిన అవసరం లేకుండా, వాటిని స్థల మార్పిడి ద్వారా వృక్షాలు అంతరించి పోకుండా చేసుకోవచ్చు అంటాడితను.


ఉల్లితో సహా అన్ని రకాల దుంప కూరగాయలు, పసుపు, అల్లం లాంటి వాటిని భూమినుంచి తీసి, వాటికున్న మొక్కలు, ఆకులను వేరుచేసి దుంపలను సేకరించేందుకు కూడా ఒక యంత్రాన్ని రూపొందించేందుకు కూడా నమూనా తయారు చేసుకున్నాడు.

కేవలం రూ. 5,000/–ల ఖర్చుతో రెండు చేతులు లేని వికలాంగులకు అద్భుతంగా పని చేసే కృత్రిమ చేతులను తయారు చేసిన అమర్‌నాథ్ ఎంతో అభినందనీయుడు. ఒక టీవీ రిమోట్‌లో చేతులు పని చేయించేందుకు అనువైన ఏర్పాట్లు చేసి, దాన్ని నమూనా చేతులకు అనుసంధానం చేయటం ద్వారా వికలాంగుడు, భోజనం చెయ్యడం, నీరు త్రాగడం లాంటి పనులకు కూడా ఇతరులపై ఆధార



కాలువలు త్రవ్వే యంత్రం నమూనా

**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్ములను గొప్పవాళ్ళను చేస్తుంది.**



దుంపలను భూమినుండి తీసి, శుభ్రం చేసి రవాణా వాహనంలో వేసే యంత్రం నమూనా

పడకుండా తనకు తానే చేసుకోవచ్చు. ఈ రిమోట్‌ను కాలి బొటన వ్రేలితో పని చేయించటం ద్వారా తనకు కావలసిన పనులు చేసుకోవచ్చు. దీనికి అవసరమైన బ్యాటరీని ఆ వ్యక్తి వీపుపై అమర్చుకోవటం ద్వారా ఈ చేతులను తాను ఎక్కడికైనా తీసుకు వెళ్ళవచ్చు అంటున్నాడు అమర్‌నాథ్.

తన సరియైన ఆర్థిక సహకారం అందించ గలిగితే ఇవే కాదు ఇంకా ఎన్నో అద్భుతాలు సృష్టిస్తాను అంటున్నాడు అమర్‌నాథ్.

అమర్‌నాథ్ ఫోన్ నెం. 80082 07620. ఇ-మెయిల్ : amarn2080@gmail.com ●

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



విక్రం రాథోడ్ సైకిల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం





గోపాల్ భిసే సైకిల్ నాగలి





మల్లేష్‌సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్


హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.


చిన్నారుల జ్ఞానం

# 'ఇగ్నైట్-2015' లో బహుమతి పొందిన చిన్నారుల ఆలోచనలు



సిద్ధాంత్ కన్న,
11వ తరగతి, కొత్త ఢిల్లీ


మెట్ల సంఖ్యను, టార్చి లైటు,
పడిపోతే తనవారికి సందేశం పంపేది,
మందులు వేసుకునే సమయం
లాంటివి తెలిపే ప్రత్యేకమైన చేతికర్ర




నవజ్యోత్ కౌర్,
12వ తరగతి
ఖోర్ధా, ఒడిస్సా

మాత్రలు నిలువ ఉంచుకుని
సమయానికి తీసుకునేలా
గుర్తు చేసే గడియారం

సుభాష్ చంద్రబోస్,
8వ తరగతి,
పుదుకోట్టై, తమిళనాడు



తగినంత దూరం, లోతులో విత్తనాలను నాటే సోలార్ గొర్రు



తన్మయ్ తకాలే
12వ తరగతి, పూణె,
మహారాష్ట్ర

పంచింగ్ చేసిన పేపర్ కన్నాలవద్ద చిరిగిపోకుండా ప్లాస్టిక్ టేప్ అతికించే పద్ధతి



పి.యస్. సెంతూర్ బాలాజీ,
12వ తరగతి,
ఈరోడ్, తమిళనాడు

గొళ్లెం లేని తలుపులకి
మనమమే అమర్చుకొనేందుకు
మనతోపాటు తీసుకెళ్ళ గలిగే
గొళ్ళెం.


ఏదైనా సమస్యకు పరిష్కారం చూపి, ఇతరుల జీవితాలను మెరుగు పరిచి, మీకు బహుమానం సంపాదించి పెట్టగల
సాంకేతిక పరమైన ఆలోచన మీవద్ద ఏదైనా ఉన్నదా?

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా అహమ్మదాబాద్ సమర్పించు

**ఇగ్నైట్-2017**

**పాఠశాల విద్యార్థులకై స్వంత సాంకేతిక ఆలోచన మరియు ఇన్నోవేషన్ల పోటీ**

దరఖాస్తులు ఆగస్టు 31, 2017 వరకు ఆమోదించబడతాయి.

మీయొక్క లేదా ఇతరుల జీవితాలను లేదా పనిని సులభతరం చేసే కొత్త యంత్రాలు/ పరికరాలు లేదా ఇంతకుముందే వున్న వాటినిసాంకేతికపరంగా అభివృద్ధి చేసే పద్ధతులకై వెతుకుతున్నాం.

ప్రత్యేకంగా వున్న ఇన్నోవేటివ్ ఆలోచనలకి, ఇన్నోవేషన్లకి వీలైతే పేటెంట్ పొందటానికి మరియు వ్యాపార అభివృద్ధి అవకాశాలకి సహాయం అందించటమే కాక, సాంకేతిక, ఆర్థిక సహాయం కూడా అందిస్తాం.

మీవద్ద ఏదైనా సృజనాత్మకమైన ఆలోచన ఉన్నట్లయితే వచ్చి పాల్గొనండి.

<u>దరఖాస్తులు పంపవలసిన / వివరాలకై సంప్రదించ వలసిన చిరనామా :</u>

**IGNITE - 17**
National Innovation Foundation - India,
Bungalow, No. 1, Satillite Complex, Prem Chand Nagar Road,
Ahmedabad - 380 015., Gujarat. Ph.: 079-2673 2095, 2673 2456
E-mail : ignite14@nifindia.org, http://nif.org.in/submitidea.php

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org, www.pallesrujana.org

*మీ దరఖాస్తులలో దయచేసి మీ ఆలోచనలు, ఇన్నోవేషన్లు, చిత్రాలు ఉంటే డయాగ్రమ్ (ఉంటే) తో పాటు మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, చదువుతున్న తరగతి, పాఠశాల/ కళాశాల పేరుతో పాటు తప్పక వ్రాసి పంపవలెను.

# అనంతపురం జిల్లాలో 20వ చిన్నశోధయాత్ర

## 23-25 సెప్టెంబర్, 2016



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా లో హనిమిరెడ్డి పల్లె నుండి కంభాలపల్లి వరకు జరిగిన 20వ చిన్న శోధయాత్రలో పాల్గొన్న యాత్రీకుల హృదయ స్పందన ఇక్కడ తెలియజేస్తున్నాం.

**కె. సుధ, చెన్నయ్ :**

ముందుగా ఈ యాత్ర నిర్వహించి నన్ను ఇందులో పాల్గొనటానికి అవకాశమిచ్చిన వారందరికీ నా హృదయ పూర్వక ధన్యవాదాలు. గ్రామస్తులతో నేరుగా కలుసుకొని వారి జీవన విధానాన్ని అవగాహన చేసుకోవటానికి ఇది నాకొక ప్రత్యేకమైన అనుభవం. గ్రామ స్థాయి ఇన్నోవేటర్లను, సాంప్రదాయ జ్ఞానాన్ని వెతకటానికి చేసే ఈ పాదయాత్రలో అదృష్టవశాత్తు వికలాంగులకు తమ దైనందిన పనులను చేసుకునేందుకు వీలుగా చేతులను తయారు చేసిన అమర్ నాథ్ అనే ఇన్నోవేటర్‌ను కలుసుకున్నాం. అలాగే మూలికలతో పశువైద్యం చేసే 80 సంవత్సరాల వయసు గల ఒక పెద్దాయన్ను కలిశాం. అతనికున్న జ్ఞానాన్ని చూసి ఆశ్చర్యపోయాం. భారత దేశంలో అతిథి సత్కారం నన్ను ఎప్పటికీ ఆశ్చర్య పరుస్తునే వుంటుంది. రెండవ ఆలోచన లేకుండా తమ ఇంటి మొత్తాన్ని ఇతరుల సౌకర్యం కోసం వాడుకోనీయటం గ్రామాల్లోనే సాధ్యమేమో?! ఈ యాత్రలో నాకు ఎదురైన ఒకేఒక (పెద్ద) సమస్య నాకు తెలుగు రాకపోవటం. ఎంతోమంది నాతో మాట్లాడాలని ప్రయత్నం చేశారు. నా భాష వారికి తెలియదు, వారి భాష నాకు తెలియదు. అయినా మనసులు కలిసి అనేక విషయాలను అర్థం చేసుకున్నాను. తెలుగు రాష్ట్రాలలో శోధయాత్రలో పాల్గొనే ఇతర ప్రాంతం వారికి కొద్దిగా తెలుగు నేర్చుకునే స్వల్పకాలిక కోర్సు ఉంటే బావుండు. నేను అనంతపురం జిల్లాకు వచ్చే ముందు ఇక్కడ నీటియెద్దడి ఉంది అని విన్నాను. కానీ, ఆశ్చర్యం ఈ 55 కి.మీ. నడకలో నాకెదురైన ప్రతి ప్రాంతంలో కళ్ళకి ఆహ్లాదం కలిగించే పచ్చని పైర్లు, టమోట, కంది, వేరుశనగ పంటలు, పొప్పాయ, మామిడి తోటలు దర్శనమిచ్చాయి. మేఘావృతమైన ఆకాశం, చల్లని గాలి, అంతకన్నా చల్లని స్నేహాన్ని పంచిన 40 మంది తోటి యాత్రీకులు..... వీరందరికీ నాయకుడిగా బ్రిగేడియర్ గారు, శ్రమ అనుకోకుండా జరిగిపోయింది మా యాత్ర.

యాత్రకు ముందు యాత్రీకులకు అందరికీ తమతమ పేట్లు, కప్పులు తెచ్చుకోమని సూచించారు. కానీ, అవి వాడే అవకాశం ఎక్కడా రాలేదు. ప్రతిచోట, ప్లాస్టిక్

**కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.**



కప్పులనే వాడాం. పర్యావరణానికి హాని కలిగించే ఇటువంటి అలవాటు ఇకపై మానేస్తే మంచిదని నా సలహా. చివరిగా ఈ యాత్రలో రుచికరమైన భోజనం, అల్పాహారం, సదుపాయాలు ఏర్పాటు చేసిన 'రాజు'కి ధన్యవాదాలు చెప్పకుండా ఉండలేను. ఇదంతా ఇంగ్లీషులో రాస్తున్నాను క్షమించండి. చెప్పాగా నాకు తెలుగు రాదు.

**నవ్య :**

గీతా సాయికృష్ణ దగ్గర నుండి చిన్నశోధయాత్ర గురించి తెలుసుకున్న వెంటనే అందులో పాల్గొనాలని నిశ్చయించుకున్నాను. ఎందుకంటే గ్రామస్తుల నుంచి నేరుగా వారి సాంప్రదాయ జ్ఞానం గురించి, ఉత్తమ వ్యవసాయ పద్ధతులను గురించి తెలుసుకోవటానికి ఇది చక్కటి అవకాశం అనిపించింది.

**మొదటి రోజు :**

బెంగుళూరు నుండి 4–5 గంటల ప్రయాణం చేసి హనిమిరెడ్డి పాలెం గ్రామం చేరాలనుకున్నాం. మేము అనుకున్నట్టుగా జరగక 2 గంటలు ఆలస్యమైంది. అయినా పెద్ద ప్రమాదమేమీ జరగలేదు. మేము కేవలం పరిచయాలు (తరువాత చేసుకున్నామనుకోండి), ఉదయపు అల్పాహారం మిస్ అయ్యాం. యాత్ర వెంకటం పల్లి, ముదినేనిపల్లి మీదుగా కోడిపల్లెలో మగిసింది. మార్గంలో రాళ్ళు తయారయ్యే పద్ధతి, అందులో ధాతువుల నిర్మాణము, రైతులకు వచ్చే తక్కువ లాభాలు, గాలిమర తయారు చేసిన పటాన్ సైదా కథ, ఆసు యంత్రం తయారు చేసిన మల్లేశం కథ, అతనికి వచ్చిన పేరు ప్రఖ్యాతులను గురించి మాట్లాడు కుంటూ వెళ్ళినా, అవన్నీ నా హృదయంపై చెరగని ముద్రనే వేశాయి. నా ఆలోచనలన్నీ కార్పోరేట్ సాంప్రదాయం, ఖరీదైన వసతులు, వనరులు ఉన్నా, మన ఆలోచనలు వీరిలా సామాన్యంగా ఎందుకు సాగవు? అనిపించింది. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన 'ఎక్కడైతే మేథస్సు స్వేచ్ఛా విహంగంలా, భయం లేకుండా .....' జ్ఞాపకానికి వచ్చింది. ఈ గ్రామస్తులను చూస్తూవుంటే ఎక్కడైతే పట్టుదల వుంటుందో అక్కడే మార్గం కనిపిస్తుంది అనిపించింది. ఆరోజంతా కలిసిన గ్రామస్తులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అటువంటి సమస్యలకే తమలాంటి ఇతర గ్రామస్తులు వేరువేరు ప్రాంతాలలో కనుగొన్న పరిష్కారాలను వారికి చెప్పుకుంటూ గణేశం గారి స్ఫూర్తిదాయక భాషణలు వింటూ సాగిపోయింది.

కోటిపల్లి వెళ్ళే మార్గంలో పశు వైద్యం చేసే 80 సంవత్సరాల 'నర్సింహప్ప' గారిని కలిశాం. ఆయన అద్భుత జ్ఞాన సంపన్నుడు. ఆరోజు జరిగిన సంఘటలను నెమరు వేసుకుంటూ నిద్రకుపక్రమించాం.

**2వ రోజు :**

ఇంకొన్ని గ్రామాలు, రెండు పాఠశాలలు సందర్శించాం. పిల్లలతో ఆడుకుంటూ వుంటే పడిన అలసటంతా మర్చిపోయాం. వారు ఉత్సాహంగా 'ఇగ్నైట్' పోటీలలో ఇతర పిల్లల ఇన్నోవేషన్లను గురించి తెలుసుకున్నాం. స్ఫూర్తిదాయకమైన పాండురంగం, చంద్రశేఖర్‌ల కథలు విన్నాం. వారు చేసిన పంచర్ కాని ట్యూబు, అనేక రకాలుగా పనికి వచ్చే శ్రీశైలం, అవి తయారరు చేయటానికి వారుపడ్డ కష్టాలను గురించి



**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**

తెలుసుకొని ఆశ్చర్యపోయాం. గ్రామ స్థాయి ఇన్నోవేటర్లకి తాము తయారు చేసిన వస్తువులు మార్కెట్‌లో విక్రయించడం పెద్ద సమస్యగా ఉంటోంది. దాని గురించి చాలాసేపు చర్చించి, ఈ సమస్య పరిష్కరించడానికి ఏవరైనా వ్యాపారవేత్త (ఎంటర్‌ప్రెన్యూర్) వస్తే బావుండనిపించింది.

**3వ రోజు :**

'రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్' సభ్యులను కలుసుకొని 'ఫాదర్ ఫెర్రర్' గురించి తెలుసుకొని వారు చేస్తున్న అనేక రకాల సామాజిక సేవల గురించి తెలుసుకొన్నపుడు ఆనందం వేసింది. ప్రజల కష్టాలు తీర్చటానికి ఇన్నోవేషన్లతో పాటు, ఇటువంటి సంస్థలు కూడా అవసరమే అనిపించింది. వికలాంగులకి కృత్రిమ చేతులు తయారు చేసిన అమర్‌నాథ్‌ను కలుసుకున్నాం. అతని కృషికి జోహార్లు. మూడు రోజులు జరిగిన యాత్ర విశేషాలను చర్చించుకుంటూ యాత్రలో చేసుకున్న కొత్త స్నేహాలను మరవద్దని బాసలు చేసుకుంటూ వెళ్ళిపోయాము.

అప్పుడు గుర్తుకొచ్చింది నాకు నేను మూడు రోజులు సెల్‌ఫోన్ వాడకుండా గడిపానని ! నా జీవితంలో ఇంతటి చక్కటి అవకాశం ఇచ్చిన 'పల్లెసృజన' బృందానికి నా ధన్యవాదాలు.

**సాహిత్య :**

ఈ శోధయాత్రలో నేను నేర్చుకున్నవి, నచ్చినవి ఈ క్రింద పొందుపరుస్తున్నాను.......

ఈ శోధయాత్ర ఏర్పాటు చేసిన పల్లెసృజన వారికి, ప్రత్యేకంగా గణేశం గారికి నా ధన్యవాదములు.

**గ్రామస్థాయి ఇన్నోవేషన్లు :**

ఈ యాత్రలో నేను, రాజన్న, నర్సింహప్ప, నల్లమ్మ,





అమర్‌నాథ్ లాంటి గొప్ప వ్యక్తులను/ ఇన్నోవేటర్లని కలుసుకోవటం ఆనందదాయకం. ఈ యాత్రలో సార్ చెప్పిన విజయ కుమార్, మల్లేశం, చంద్రశేఖర్ మొదలైన ఇన్నోవేటర్ల కథలు చాలా స్ఫూర్తినిచ్చాయి. వాళ్ళ ప్రయాణం ఇన్నోవేషన్ల ముందు – తర్వాత చాలా మందికి కనువిప్పుగా ఉన్నవి. నాకు మాత్రం చాలా నచ్చింది. నామటుకు నాకు గ్రామస్థాయి ఇన్నోవేటర్లను కలవటం, వారి గురించి వివరాలు సేకరించి, గ్రంథస్తం చేయటం అన్నవి చాలా ముఖ్యమైన, కష్టతరమైన పని. పట్టణాలలో ఈ స్టార్టప్ కంపెనీలకి 'వెంచర్ క్యాపిటల్ సదుపాయం' ఉన్నట్లు పల్లెల్లో ఈ ఇన్నోవేటర్లకి వారి ఇన్నోవేషన్లని అభివృద్ధి చేయటానికి, సర్టిఫై చేయటానికి, ఉత్పత్తి చేయటానికి, మార్కెట్ చేయటానికి ఆర్థిక సహాయం చేసే సంస్థ/లు ఉండాలి.

ఈ యాత్ర తర్వాత గ్రామస్థాయి ఇనోనవేషన్లపై నాకు మక్కువ పెరిగింది. నాకు సమయం ఉన్నప్పుడల్లా నా మాటల్లో, రాతల్లో దీని గురించి చెప్పాలని నిర్ణయించుకున్నాను. నా కుటుంబ సభ్యులకి, స్నేహితులకి, పరిచయం లేని వారికి కూడా ఈ గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లను గురించి చెప్పాలన్న తపన ఎక్కువవుతోంది. ఏమో ఏం చెప్పగలం? నాయీ ప్రయత్నం వీరిని గురించి నలుగురికి చెప్పటానికి ఉపయోగ పడటమే కాకుండా, కొత్త ఇన్నోవేటర్లని వెతకటానికి కూడా ఉపయోగ పడుతుందేమో!

గణేశం గారు ఇన్నోవేషన్లను గురించి మాట్లాడుతూ వుంటే నేను ఆయనవంక కాక, వింటున్న గ్రామస్తుల మొహాలు చూస్తూ వుండిపోయాను. ఆయన వారిలో నిద్రాణమై వున్న ఇన్నోవేటర్లని మేల్కొలపటానికి చేస్తున్న

**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**

ప్రయత్నంలా కనిపించేది. చాలా కళ్ళు ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ వున్నా, కొన్ని కళ్ళల్లో తామూ ఏదైనా చేయాలనే తపన కనిపించేది. అదే ప్రారంభం! తమకోసం, తమవారికోసం తామే పాటు పడాలన్న స్పృహ రావటానికి!!

**తోటి యాత్రీకులు :**

ప్రతి యాత్రీకుని వద్ద ఒక కథ వుంది. అన్నీ చెప్పేసుకున్నాం. ఇంకా చెప్పుకోవలసింది చాలా ఉండి పోయింది. నేను నడిచింది కేవలం 54 కి.మీ. మాత్రమే! మొత్తం యాత్రలో ఒకరితో ఒకరు మాట్లాడాలని తాపత్రయ పడేవాళ్ళు. ఆలోచనలను పంచుకోవాలని ఉత్సాహ పడినవారే. తమకు తెలియనిది, ఇంకొకళ్ళకేమైనా అదనంగా తెలిసిపోయిందేమోనని, అది తామూ తెలుసుకోవాలి అనే తపన. యాత్ర పూర్తయిన తర్వాత వారందరి కథలు నాకథలో భాగమైపోయాయి....... అందరికీ అంతేమరి..!

**గ్రామీణ జీవితం :**

నాకు ముందునుంచి కూడా గ్రామస్తులంటే ఒక ప్రత్యేకమైన గౌరవముండేది. ఈ యాత్ర తర్వాత అది





ఎన్నోరెట్లు పెరిగిపోయింది. మన పట్టణాలలో ఎవరు పరిచయం లేని వారికి ఆతిథ్యమిస్తారు? ఎవరు రోడ్డుమీద నడిచిపోతుంటే పలకరిస్తారు? ఎవరు మా ఇంటికి భోజనానికి రండి అని ఆహ్వానిస్తారు?....... పరిచయం లేనివారిని ఒదిలెయ్యండి, మన పొరుగు వారితో ఎంతసేపు మాట్లాడాం? పట్టణ జీవితాల్లో కలిసి ఉండటం అనే సాంప్రదాయాన్నే మర్చిపోయారు. గొప్ప, బీదల మధ్య, అంతస్తుల మధ్య దూరాలు ఎక్కువైపోయాయి, అవుతున్నా యి. కానీ మన పల్లెవాసులకు మాత్రం ఈ అంటురోగం అంటుకోలేదు.

పల్లెవాసులు, ప్రకృతికి ఎంత దగ్గరగా జీవిస్తున్నారో చూస్తే ఈర్ష్య వేస్తుంది. ఈ ముఖ్యమైన భాగం మన పట్టణాలలో సమసిపోయిందేమోనని భయమేస్తోంది. అక్కడ పచ్చని పొలాలు చూస్తూవుంటే, నాకూ సేంద్రియ వ్యవసాయం చేయాలనిపించింది. ఖచ్చితంగా మా ఇంట్లోనే కొన్ని కూరగాయలు పండిస్తానీ సంవత్సరం.

నాకెప్పుడూ అర్థం కానిది ఒక్కటే, ఈ పల్లెటూరి వాళ్ళు మనలో ఏం గొప్పతనం చూస్తున్నారు? చదువుకున్న వాళ్ళమనా? మనం గొప్పవాళ్ళమనే భావన వారిలో చాలా కనిపించింది. వారి మాటల్లో 'ఊరోడు' అనటంలో ఒక

నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.





చిన్నచూపు, పట్నమబ్బాయి అనటంలో గౌరవం..... వాళ్ళకు అలవాటైపోయింది. ఈ పద్ధతి పోవాలి. ఇలాంటి యాత్రలే వారిలో ఈ భావం పోవటానికి తోడ్పడాలి. వాళ్ళు పట్టణ వాసులకేమీ తీసిపోము అని అనుకోవాలి. దీనికి కొంచెం సమయం పట్టవచ్చు. బహుశా దీనికి కారణం వ్యవసాయం చేసే వాళ్ళు పెద్దగా చదువుకొని వుండరు, అందుకే రైతులకి గౌరవం లేదు అన్న ఆలోచనేమో! నా ఉద్దేశ్యంలో పల్లెవాసులే జ్ఞానవంతులు, మనకన్నా చదువుకున్నవాళ్ళు, కష్టపడేవాళ్ళు, సమస్యలను ఎదుర్కొనేవాళ్ళు, నలుగురికీ సహాయం చేసేవాళ్ళు. మనుషుల్లో మట్టి పిసుక్కునే రైతే చాలా గొప్పవాడు అన్న భావన వచ్చినపుడే ఈ అంతర్యాలు సమసిపోతాయేమో!

**పిల్లలు :**

నాకు ఈ యాత్రలో పట్టణాల్లోనైనా, పల్లెల్లోనైనా పిల్లలు పిల్లలే అనిపించింది. వారి ఉత్సాహం, ఉత్సుకత ముచ్చటేసింది. వారిద్దరిలో జీవితంపై ఒకే ఆసక్తి వుంది. మనం చేయాల్సిందల్లా పట్నం పిల్లలతో సమానంగా చదువుకునే అవకాశం పల్లె పిల్లలకివ్వాలి. సత్వరం తప్పకుండా ఇవ్వాలి. ఈ విషయంలో 'రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్' వారు చేస్తున్న సేవ శ్లాఘనీయం. ఆ పిల్లలకి ఇన్నోవేషన్లను గురించి చెప్తూవుంటే, ఆ కళ్ళల్లో మెరిసిన మెరుపే ఎంతో తృప్తినిచ్చింది. మనం పట్టణ పిల్లల చదువుకి ఏమి ఏర్పాట్లు చేస్తున్నామో అవన్నీ పల్లెల్లోని పిల్లలకీ అందేటట్లు చూడాలి.

**ఉత్సాహం, శక్తి :**

యాత్రలో గణేశం గారిని చూసి నేను వ్యక్తిగతంగా నేర్చుకున్నది. అలుపు లేకుండా మైళ్ళకొద్దీ నడిచేస్తారు. ఎక్కడా కూర్చోరు, విశ్రాంతి తీసుకోరు. ఆయన నడక వేగం అందుకోవటానికి ఆయన వయస్సులో సగం వంతు లేదా పావు వంతు వున్నా మాకెవరికీ సాధ్యం కాలేదు. ఆయన వెనక మేము కాళ్ళ నెప్పులు, కాళ్ళు బెణకటం, నడుం నెప్పులతో వెంబడించాం. మిలట్రీ నుంచి బ్రిగేడియర్‌గా రిటైరైనా, ఆ క్రమశిక్షణ, అలవాట్లు పోలేదు. ఆయన్ను చూసి నేను నిర్ణయించుకున్నాను.... నా ఆలోచనలు, తిండి, వ్యాయామం గురించి శ్రద్ధ తీసుకోవాలని.

## క్రాంతి కుమార్ మరియు ఎర్రమల్లి అభిలాష్ పంపిన చిన్నశోధయాత్ర చిత్రమాల



ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్న నల్లమ్మ



హనిమిరెడ్డిపల్లె గ్రామస్తులతో.....

**మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.**


మూలికా వైద్యుడు నర్సింహప్పతో....


బత్తువానిపల్లె పాఠశాల పిల్లలతో...


తేనీటి విందుతో సేద తీరుతూ ....


రైతు ఇన్నోవేషన్ సీడర్‌తో....


శోధయాత్రీకులతో తన వ్యవసాయ అనుభవాలను, జ్ఞానాన్ని పంచుకుంటున్న 80 ఏళ్ళ వృద్ధరైతు గంగప్ప


మధ్యాహ్న భోజనం చేస్తూ.....


జ్ఞాన వృద్ధులు






రమణీయ ప్రకృతి దృశ్యాలు..

నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.



# తక్కువ ధరకే చెవిటి మిషన్

## ఇంటర్ చదువుతున్న యువకుడు గణేష్ అద్భుత ఇన్నోవేషన్

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని నందనం గ్రామానికి చెందిన స్వరూప, చంద్రయ్య దంపతుల కుమారుడు యాకర గణేశ్ ప్రస్తుతం వరంగల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చిన్నప్పటినుండి 'ఏదైనా సాధించాలి' అనే అతని ఆలోచనా విధానం. తన చదువుతో పాటు ఎల్లప్పుడూ ఏదో ఒక పరికరాలను తయారు చేయటంలోనే ఇతనికి శ్రద్ధ మక్కువ. ఇతను తయారు చేసిన పరికరాలను చూసి అధ్యాపకులే అబ్బురపోయేవారు. ఇతని ప్రత్యేకతను గుర్తించిన అధ్యాపకులు ఇతనిచేత ఎన్నో పరికరాలను తయారు చేయించి సైన్స్‌ఫేర్‌లలో ప్రదర్శింపజేసేవారు. అందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా వారే చేసేవారు. వాటిలో చాలావాటికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రశంసా పత్రాలు, బహుమతులు లభించాయి. అబ్దుల్ కలాం ఆలోచనా విధానమంటే ఇతనికి మక్కువ ఎక్కువ.

ప్రేరణ :

తన ఇంటి పరిసరాలలో చాలామంది చెవిటి వారు. పేదరికంలో మగ్గుతున్న వారు ఆస్పత్రులకు వెళ్ళలేక, చెవిటి మిషన్ కొనే స్థోమత లేక అలాగే చెవుడును భరిస్తూ వుండటం ఇతన్ని బాధించింది. ఈ చెవుడు ముదిరిన తర్వాత మాటలు కూడా ఎక్కువగా మాట్లాడక పోవటం గమనించాడు. వీరికొరకు తక్కువ ఖరీదులో చెవిటి యంత్రాన్ని తయారు చేస్తే బావుంటుందని ఆలోచించి, తనకున్న ఎలక్ట్రానిక్ పరిజ్ఞానంతో తన అధ్యాపకులను సంప్రదించి, వారి ద్వారా కొందరు వైద్యులను సంప్రదించి మొత్తానికి ఒక చెవిటి యంత్రాన్ని తయారు చేశాడు దానికి 'సూపర్ డెఫ్ మిషన్' అని నామకరణం చేశాడు. కేవలం రూ. 150/–లకు లభించే ఈ యంత్రం వల్ల అతి సామాన్యులు కూడా చెవిటి యంత్రాన్ని కొనుగోలు చేసుకోగలిగేలా దీన్ని తయారు చేసిన గణేశ్ ఎంతో అభినందనీయుడు.

పరికరం పని తీరు :

ఒక డీసీ మోటారు, కేబుల్, ఇయర్ పిన్ బిగించి




ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.



సెల్‌ఫోన్‌కు అనుసంధానం చేశాడు. కేబుల్‌లోని ఒక చివరను నోట్లోని పంటితో పట్టుకోవాలి. అలా చేయటం వల్ల శరీరంలోని ఎముకలకు శబ్ద తరంగాలు తగిలి అవి నేరుగా మెదడుకు అందటం వల్ల శబ్దం వినిపిస్తుంది.

దీన్ని తయారు చేయటానికి రెండు నెలల సమయం పట్టింది. దీన్ని ఇప్పటికే రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రదర్శించడం జరిగింది. అఖిల భారత అంతర్జాతీయ ఫేర్ పోటీలకు కూడా ఎంపిక చేయబడింది. బెంగుళూరులో సెప్టెంబర్ 9 నుండి 11 వరకు జరిగిన పోటీలలో పాల్గొన్నాడు. ఆ పోటీలకు వెళ్ళే ఆర్థిక స్థోమత లేని గణేశ్‌ను 'పల్లెసృజన' బెంగుళూరు పోటీలకు పంపడం జరిగింది. అక్కడ జరిగిన పోటీలలో ఎంతోమంది నిష్ణాతులు పరికరం తయారు చేసిన గణేశ్‌ను అభినందించారు. ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో సూపర్ డెఫ్ మిషన్‌కు రెండవ స్థానం దక్కడం ఎంతో ఆనందదాయకం.

మహిళలు తమపై జరిగే లైంగిక దాడులను



ఎదుర్కొనేందుకు సహకరించే విధంగా 'చేతి తొడుగులు' (గ్లౌజులు) కూడా తయారు చేశాడు గణేశ్. అంతే కాదు తన వద్ద తగినంత ఆర్థిక స్థోమత లేదని, తనకు ఆర్థికంగా సహకరిస్తే ఇంకా ఎన్నో రకాల ఇన్నోవేషన్లు తన మదిలో మెలుతున్నాయని అంటాడు గణేశ్.

తెలంగాణ ప్రభుత్వంతో పల్లెసృజన ఈ యువ ఇన్నోవేటర్‌ను సంధానం చేసింది. అంతే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గణేష్ ఇన్నోవేషన్లకు గుర్తింపు తీసుకు రావటానికి పల్లెసృజన కృషి చేస్తున్నది.

**గణేష్ సెల్ నెం. : 87904 93507**

## ఎన్.ఐ.ఎఫ్. లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia. org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.**

# అడవి పందుల నుండి పంటల రక్షణకు
## రైతుల పరిష్కారాలు



- పల్లెసృజన, ఎన్.ఐ.ఎఫ్. సేకరణ

**1.** అడవి పందులు పొలాల్లో చేరి, పటలను నాశనం చేయటమే కాక, పంటలకి మేలు చేసే వానపాములను, మిత్ర పురుగులను తినేస్తాయి. వీటినుండి పంటలని రక్షించుకోవటం కోసం రైతులు 'ఎర్ర కారంపొడి'ని పొలం గట్లమీద చల్లుతారట. ఈ ఘాటుకి పందులు పొలాల ఛాయలకి రావట. ఈ పద్ధతి గుజరాత్ రాష్ట్రంలోని బనస్కాంత జిల్లాలోని రైతులు అవలంభిస్తున్నారట.

**2.** **హర్యానాలో** జరిగిన శోధయాత్ర సందర్భంగా అక్కడి రైతులు మా శోధయాత్రీకులకి వారు అవలంభించే పద్ధతులను గురించి వివరిస్తూ... 'కారం చల్లటం వలన చాలా క్రిములు నాశనమౌతూ వుండటం గమనించి ఎండిన ఎర్ర మిరపకాయలలను ఆవు పేడతో కలిపి పిడకలు చేసి పొలాల గట్లవెంబటి కాలుస్తారట. ఈ ఘాటైన పొగకి జంతువులు పొలాల్లోకి రాకుండా పోతాయట!

**3.** **'నేషనల్ జియోగ్రాఫిక్ న్యూస్'** సెప్టెంబర్ 18, 2006లో ప్రచురింపబడ్డ ఒక వ్యాసం ప్రకారం ఆఫ్రికా దేశంలో చాలాచోట్ల ఈవిధంగానే కారంపొడిని పేడలో కలిపి కాల్చి ఏనుగుల నుండి తమ పొలాలను రక్షించుకుంటారట. కొందరు పొలాల చుట్టూ కారంపొడి, గ్రీసు కలిపిన తాళ్ళని కంచెగా కట్టి ఇదేవిధమైన ఫలితాలను పొందుతున్నారట. జనవరి 21, 2010 'ది హిందూ' దినపత్రికలో ఆర్. క్రిష్ణకుమార్ వ్రాసిన వ్యాసం ప్రకారం కర్ణాటక ప్రాంతం, చామరాజ నగర్ జిల్లాలో రైతులు కొబ్బరి తాడుకు ఇంజనాయిలు, కారము కలిపి పూసి పొలానికి కంచెలా కట్టి జంతువుల నుండి తమ పొలాలని కాపాడుకుంటున్నారు.

**4.** **తెలంగాణ, ఆంధ్రప్రదేశ్** రాష్ట్రాల్లోని పలు గ్రామాల్లో పంట పొలాలను ధ్వంసం చేస్తున్న అడవి పందులను రైతులు చలా స్వల్ప ఖర్చుతోనే తరిమి కొట్టవచ్చు అంటున్నారు. అడవి పందులను పారద్రోలేందుకు దీపావళి సామాగ్రి తయారీకి ఉపయోగించే గంధకం పొడిని, ఆముదాన్ని కలిపిన మిశ్రమాన్ని 'పురికొస' (సుతిలి)కి పూయాలి. ఈ తాడును పొలం గట్లవెంట నాలుగువైపులా కట్టాలి. అడవి పంది దూరం నుంచే ఈ వాసనకు తల్లడిల్లి పొలంవైపు రాకుండా పారిపోతుంది. అక్కడ వేరే పందిని వధించినట్టుగా వచ్చే ఈ వాసనగా ఆ పంది భావించి వెంటనే అక్కడినుండి నిష్క్రమిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోని

**మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.**

కొన్నిచోట్ల ఈ ప్రయోగాన్ని ఆచరించి ఫలితాలు సాధించటం జరిగింది.

**5.** అడవి పందులు ఒక సరిహద్దును ఏర్పరచుకొని దానిలోనే సంచరించే జీవాలు. కొందరు రైతులు స్థానిక పంది పెంటను నీటిలో కలిపి తమ పొలాల చుట్టూ చల్లినట్లయితే పందులు ఆ హద్దును దాటి లోపలికి రావు. ఎందుకంటే అవి పందులతో విరోధం పెట్టుకోవట! అదేవిధంగా పంది పెంటను పిడకలుగా చేసి ఎండిన తర్వాత వాటిని మట్టి కుండలో పెట్టి నిప్పు పెట్టినచో అవి నెమ్మదిగా కాలుతూ వుంటాయి. ఇలా పిడకలు పెట్టిన ఈ కుండలను పొలం చుట్టూ గట్ల వెంట అక్కడక్కడా ఏర్పాటు చేసినట్లయితే ఆ పొగ వాసనకు అడవి పందులు ఆ ఛాయలకు రావు.

**6.** అడవి పందులకి కంటిచూపు, వినికిడి తక్కువ. కనుక అవి అధికంగా వాసనమీదే ఆధార పడతాయి. ఆ ఒక్క ఆధారానికి విరుగుడును ఏర్పాటు చేసినట్లయితే వాటి బారినుండి పంటలను రక్షించుకోవటం సులువు. దీనికి సాధారణంగా మంగళి దుకాణాల్లో దొరికే కత్తిరించిన మనుషుల జుట్టును అడవి పందులు తిరిగే ప్రాంతంలో చల్లుతారు. అవి వాసన చూస్తూ ముందుగు సాగుతూ వుంటే, ఈ వెంట్రుకలు దాని ముక్కులోకి దూరి పోతాయి. అప్పుడు ఆ పందులు చికాకుగా, దగ్గర మనుషులు ఉన్నారని భావించి, ఇతర అడవి పందులను ఆ ప్రాంతానికి రావద్దు అని హెచ్చరిస్తూ పారిపోతాయి.

**7.** పై విధంగానే పందులు తిరిగే ప్రదేశంలో కారం పొడి చల్లినా అవి ఆ ఘాటును భరించలేక పారిపోతాయి.





**8.** పెద్ద పెద్ద శబ్దాలన్నా అడవి పందులకు భయమే. దీని కొరకై వాటిని బెదిరించటానికి డప్పులు, డబ్బాలు, కేకలు, టపాకాయలు పేల్చటం లాంటి పద్ధతులను కూడా వాడి వాటిని పారద్రోలుతూ వుంటారు.

**9.** కొంచెం ఖర్చుతో కూడుకున్న పనే అయినా, పొలంచుట్టూ దట్టమైన ముళ్ళకంచె వేసి కూడా అడవి పందుల బారినుండి పొలాన్ని రక్షించుకోవచ్చు.

**10.** పొలం చుట్టూ మూడు అడుగుల ఎత్తు వరకు కొబ్బరి తాడును లేదా పాత నవారుని కిరోసిన్ (పంట వాసన వాటికి తగలకుండా ఏదైనా విరుగుడు వాసన గల ద్రావకం) లో ముంచి కంచెలా కట్టినా పందుల బెడదను అరికట్టవచ్చు.

**11.** పొలాల పరిసరాల్లో ఒక్క అడవి పందిని చూసినా, వెంటనే వాటి నివారణ చర్యలు చేపట్టాలి. లేనిచో ఆ ఒక్క పంది వెళ్ళి పందుల సమూహంతో పొలంపై దాడి చేసే అవకాశాలు ఎక్కువ.

**12.** పాత నూలు చీరలను పొలం చుట్టూ కట్టడం వల్ల కూడా పందుల నుండి పంట రక్షణ చేయవచ్చు.

'పల్లెసృజన' గతంలో కూడా అడవి పందుల నుండి పంటల సంరక్షణ గురించి ప్రచురించిన వ్యాసాలను అనుసరించి రైతాంగం సత్ఫలితాలను పొందినట్లు తెలిసింది. ఇక్కడ ప్రచురించిన అంశాలను ఉపయోగించి పందుల బారినుండి సంరక్షణకై మీరేమైనా ప్రయోగాలు చేసినచో వాటిని మాతో పంచుకోగలరు. మీ జ్ఞానాన్ని, అనుభవాలను 'పల్లెసృజన'లో ప్రచురిస్తాం. – ఎడిటర్

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**

# గుజరాత్ రాష్ట్రంలోని పల్లెకబుర్లు

**పొదుగు వాపు వ్యాధికి ఆయుర్వేద ఔషధం:**

పొదుగువాపు వ్యాధి పశువులలో సాధారణంగా వచ్చే జబ్బు. ఇది సోకిన పశువు పాలు పితికితే పాలతో పాటు రక్తం, చీము వచ్చే అవకాశాలుంటాయి. పశువు నీరసించడమే కాకుండా, పాలు పితేటపుడు ఎంతో బాధకు గురవుతుంది. సరైన సమయంలో దీనికి చికిత్స అందించక పోతే పశువు మరణించే ప్రమాదం కూడా ఉంది. దీనికి చాలా మంది మూలికా వైద్యులు ఎన్నో రకాలుగా చికిత్సా మార్గాలు అవలంభిస్తున్నా, గుజరాత్ రాష్ట్రంలోని 'మెహసనా జిల్లా, విజాపూర్ తాలూకా, మాలోసన్' గ్రామానికి చెందిన "తారాబేన్ వాసుదేవ్ భాయ్ పటేల్" అనే వ్యవసాయం చేసే మహిళ తనదైన పద్ధతిలో ఒక సులభ మార్గాన్ని అవలంభిస్తూ వుంటుంది.



దీనికి ఆమె అందరికీ అందుబాటులో వుండే వస్తువులనే వాడుతూ వుంటుంది. ఆమె 50 గ్రా. చింత పండును, 100 మి.లీ. వేడి నీటిలో నానబెట్టి బాగా నానిన తర్వాత చింతపండులోని ఈనెలు, గింజలను తీసివేసి మెత్తగా పిసికి గుజ్జుగా తయారు చేస్తుంది. ఇందులో ఆమె 50 గ్రా. నీలిమందును కలిపి జబ్బు సోకిన పశువు పొదుగుకు ప్రతిరోజు వారం పాటు పట్టిస్తూ వుంటుంది. వ్యాధి తగ్గిన తర్వాత కొన్ని రోజులు పాలు పితికే ముందు 'ఐస్ ముక్కలు' నింపిన ఒక సంచితో పొదుగుకు వత్తుతూ వుంటుంది. పశువుకు స్వాంతన కలిగి నెప్పికి లేకుండా పాలను ఇస్తుంది. ఈ పద్ధతిని ఆమె ఎన్నో సంవత్సరాలుగా తాను వాడటమే కాక, చుట్టుప్రక్కల వాళ్ళకి కూడా చెపుతూ వుంటుంది.

**పశువులు పారుకునే జబ్బుకు మందు:**

పశువులకి సరియైన తిండి పెట్టకపోయినా, చెడిపోయినవి పెట్టినా లేదా, అతిగా తిన్నా అవి పారుకునే వ్యాధి భారిన పడటం జరుగుతూ వుంటుంది. ఇది సహజమే అయినా దీనివలన కొన్ని సందర్భాలలో వ్యాధి తీవ్రమై పారుకోవటంలో చీము, రక్తము కూడా పోయే ప్రమాదముంది. సరైన సమయంలో చికిత్స అందించకపోతే ఇది ప్రాణాంతకంగా కూడా మారే అవకాశముంది. దీనికై గుజరాత్ రాష్ట్రంలోని, సబర్కాంత జిల్లా, విజయ నగర్ తాలూకా, కారోల్, వాసాయ్ గ్రామానికి చెందిన "శైలేష్ భాయ్ కుమాజీ కతుల్యా" చాలా సులభమైన పద్ధతి అవలంభిస్తూ వుంటాడు.

ఈ వ్యాధి నివారణకు ఆయన 100–200 గ్రా. అడవి ఆముదం లేదా కొండ ఆముదము చెట్టు వేర్లను



**కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.**

తీసుకుని, వాటికి 100 గ్రా. తేయాకులను చేర్చి రెండింటినీ బాగా మెత్తగా నూరి 300 మి.లీ. నీటిలో ఉడకబెడతాడు. చల్లారిన తర్వాత ఈ ద్రావకాన్ని వడకట్టి పశువుచేత తాగిస్తాడు. ఇలా చేస్తే వెంటనే పశువుకి ఉపశమనం లభిస్తుందని చెప్తాడాయన. ఇదే మేకలకు, గొర్రెలకు అయితే ఈ ప్రమాణాన్ని సగం చేసి వాడవచ్చునని చెప్తాడాయన.

ఈ వ్యాధికే రాజ్‌కోట్ జిల్లా, బోందల్ తాలూకాకి చెందిన "కాలూ భాయ్ భీంజీభాయ్ జియానీ" అనే రైతు మరొక పద్ధతిలో వైద్యం చేస్తూ వుంటాడు. ఇతను ఎండిపోయిన మొక్కజొన్న కంకులను కాల్చి, ఆ బూడిదను జల్లెడ పట్టి సుమారు 250 గ్రా. బూడిదలో ఒక లీటరు మజ్జిగ కలిపి వ్యాధి వచ్చిన పశువుకి రోజుకి రెండుసార్లు తాగిస్తాడు. మూడు రోజులపాటు ఇలా చేస్తే వ్యాధి తగ్గిపోతుందని చెప్తున్నాడీయన.

**గొడ్డుపోయిన పశువుకి వైద్యం:**

పశువులు చూలుకు రాక గొడ్డుపోయినట్లు అనిపిస్తే యజమానికి ఆర్థికంగా చాలా ఇబ్బంది కలుగుతూ వుంటుంది. పశు సంపద పెరగదు, పాడి వుండదు. ఇటువంటి సందర్భాలలో 'సబర్కాంత జిల్లా, విజయనగర్ తాలూకా'కి చెందిన "కుమాజీ బదాజీ కతిల్యా" ఒక ఔషధ పద్ధతిని వాడుతూ వుంటాడు. ఆయన దురదగుండి చెట్టు పళ్ళను ఐదింటిని పశువుకు ఉదయంపూట దాణాలో కలిపి తినిపిస్తాడు. దీనిలో వున్న ఔషధ గుణాల వలన పశువు ఆరోగ్యం మెరుగవడమే కాక, చూలుకు కూడా సిద్ధమవుతుంది. ఒక వారం రోజుల పాటు ఇలా చేస్తే సరిపోతుంది. ఈ పద్ధతిలో ఏ దుష్పరిణామాలు ఉండవని పశువుకు కూడా క్షేమమేనని చెపుతున్నాడీయన.



**ఈత వేసుకునే పశువులకు (చూలు జారిపోవడం) వైద్యం:**

పశువు శరీరంలో అధిక వేడిమి అయినపుడు గర్భస్రావం జరగడం జరుగుతూ వుంటుంది. దీన్నే కొన్ని ప్రాంతాలలో ఈత వేసుకుపోవడం, చూలు జారిపోవడం అంటారు. అటువంటి పశువులకు సబర్కాంత జిల్లా, మేగ్రాజ్ తాలూకా, మున్సివాడ గ్రామానికి చెందిన "రాంజీభాయ్ భీంజీభాయ్ పర్మార్" తనకు తెలిసిన పద్ధతిలో వైద్యం చేస్తూ వుంటాడు. ఆయన బూరుగు చెట్టు బెరడు రెండు గుప్పెళ్ళు తీసుకుని, రెండు లీటర్ల నీటిలో మరిగిస్తాడు. నీరు సగం అయిపోయిన తర్వాత బెరడును తీసివేసి, ఆ వేడి నీటిని కొద్దిగా దంచిన జొన్నలతో కలిపి ఆ మిశ్రమాన్ని పశువుకు తినిపిస్తాడు. ఒక వారం రోజులు ఇలా చేస్తే పశువుకు ఆరోగ్యం మేలై సాంత్వన కలుగుతుందని చెప్తున్నాడీయన. తానీ పద్ధతిని చాలా సంవత్సరాలుగా వాడుతున్నాడట.



## పల్లెసృజన చందాదారులకు విజ్ఞప్తి

మీ చందాను పునరుద్ధరించుకునేవారు మీ చందాను పంపేటప్పుడు సభ్యత్వ సంఖ్యను తెలియజేయ గలరు. మీ సభ్యత్వ సంఖ్య, చందా తిరిగి కట్టవలసిన తేదీలు పల్లెసృజన పత్రిక పంపే గోధుమ రంగు కవరుపై అతికించే మీ చిరునామా లేబుల్‌లో మీ పేరు పైన ముద్రించబడి వుంటుంది.

**వివరాలకు ఫోన్ : 040-2711959**

# ప్రకృతి వైద్యం - సాంప్రదాయ వైద్యం

ఈ సంచికలో ప్రచురించిన ప్రకృతి వైద్యం - సాంప్రదాయ వైద్యం చిట్కాలను అందించినవారు : **రాధాకృష్ణ, ఎక్లాస్‌పూర్ (గ్రా.), నారాయణపేట (మం), మహబూబ్‌నగర్ జిల్లా - 509 210. ఫోన్ : 94901 64954.**

**దగ్గు నివారణకు చిట్కాలు:**

దగ్గు అనేది ఏ వయసు వారికైనా వచ్చే సాధారణ జబ్బు. దీని నివారణకు ఇంట్లోనే లభించే వాటితో కొన్ని చిట్కాలు

**001 తులసి ఆకులు-మిరియాలతో ఔషధం :**

తులసి ఆకులు - 5, మిరియాలు - 2 తీసుకుని వాటిని నోట్లో వేసుకుని మెత్తగా నమిలి మింగాలి. ఇలా ఉదయం పరగడపున, రాత్రి భోజనం తర్వాత నిద్రపోయే ముందు చేసినచో దగ్గు త్వరితగతిన తగ్గుముఖం పడుతుంది.




**002 శొంఠి - మిరియాలతో ఔషధం :**

శొంఠి, మిరియాలు సమానంగా తీసుకుని మెత్తగా పొడి చేసి పలుచటి బట్టతో శోధిస్తే మెత్తటి పొడి వస్తుంది. దానిని ఒక గాజు సీసాలో నిల్వ చేసుకుని, మూడు వేళ్ళకు వచ్చినంత పొడిని అరచేతిలో వేసుకుని, అందులో స్వచ్ఛమైన తేనె కలుపుకుని ఉదయం, రాత్రి కడుపులోకి తీసుకున్నట్లయితే దగ్గుతో పాటు, గొంతు నొప్పి కూడా తగ్గుతుంది.




**003 తులసి ఆకు మిరియాల ఔషధం :**

తులసి ఆకులు-5, మిరియాలు -2. శొంఠి కొంత తీసుకుని ఈ మూడింటిని కలిపి మెత్తగా దంచి, వడపోసి, ఈ రసంలో కొంత తేనె కలిపి కడుపులోకి తీసుకున్నట్లయితే దగ్గునుండి త్వరగా ఉపశమనం పొందవచ్చు. చిన్న పిల్లలకు వేసేటప్పుడు కొంత తగ్గించి వేస్తే సరిపోతుంది.

**జలుబు నివారణకు చిట్కాలు:**

**004 శొంఠి-మిరియాల కషాయం :**

శొంఠి మిరియాలను కలిపి కషాయం తయారు చేసుకుని రాత్రి నిద్రించే ముందు సగం గ్లాసు కషాయం తీసుకోవాలి. ఆ తర్వాత 5 మిరియాలు, 50 గ్రా. పుట్నాలను కలిపి నోట్లో వేసుకుని నమిలి మ్రింగాలి. వీటిని తీసుకున్న తర్వాత నీళ్ళు త్రాగకూడదు. వీటిని భోజనం అయిన తర్వాతనే తీసుకోవాలి. జలుబు అయినవాళ్ళు వేడినీరు సేవిస్తూ వుంటే మంచిది.

**005 జండుబామ్‌తో వైద్యం :**

బాగా జలు ఉన్నవారు బాగా మరిగించిన నీటిలో కొంత జండుబామ్ (ఒక అగ్గిపుల్లతో తీసుకుని) ను ఆ వేడినీటిలో వేసి, ఎక్కడా గాలి చొరబడకుండా దుప్పటి కప్పుకుని ఆ వేడి నీటినుండి వచ్చే జండుబామ్‌తో కూడి వస్తున్న ఆవిరిని బాగా పీల్చినచో జలుబు నుండి త్వరలో ఉపశమనం లభిస్తుంది. పాత బెల్లం కొంత తిన్నా కూడా జలుబు నుండి ఉపశమనం లభిస్తుంది.

శరీరంలో ఉష్ణోగ్రత నివారణకు ఔషధాలు :

**006 కండ చక్కెరతో వైద్యం :**

మనిషి శరీరంలో వేడి ఎక్కువగా ఉంటే ఎటువంటి ఔషధాలు వాడనవసరం లేదు. ప్రతిరోజు ఎక్కువ సార్లు నీటిని త్రాగడం వల్ల ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. ఇంకా తగ్గకుంటే ఆ నీటిలో కొంత కండ చక్కెర కలిపి



ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?

నీటిని సేవిస్తే ఉష్ణోగ్రత తగ్గుముఖం పడుతుంది.

**007 మొలలు (పైయిల్స్) నివారణకు ఔషధం :**

'కరక్కాయ' పొడిని పాత బెల్లంలో కలిపి శనగ గింజ,త గోలీలు చేసి పరగడుపున ఒకటి తీసుకుని పలుచటి మజ్జిగ త్రాగాలి. అలాగే రాత్రి భోజనం అయిన తర్వాత కూడా ఒక మాత్ర తీసుకుని, మజ్జిగ త్రాగాలి. ఇలా మూడు రోజుల పాటు తీసుకున్నట్లయితే మొలల నుండి ఉపశమనం కలుగుతుంది.





క్రింద పిలకలు వచ్చినవారు వారి మూత్రాన్ని తీసుకుని గుదం దగ్గర రక్తం కారుతున్న మొలల పిలకలపై పూసినట్లయితే అవి రెండు రోజులలో మాడిపోతాయి. మూడు పూటల మజ్జిగ త్రాగుతూ వుంటే ఎలాంటి ఆపరేషన్ లేకుండా మొలలు తగ్గిపోతాయి.

మొలలు ఆపరేషన్ చేయించుకున్న వారు వృద్ధులయిన తర్వాత వారికి మల మూత్రాలు స్పర్శ లేకుండా వస్తాయి. కాబట్టి మొలలను ఆయుర్వేద, సాంప్రదాయ వైద్యం ద్వారానే నయం చేసుకోవటం మంచిది.

**008 రక్తపోటు, మధుమేహం తగ్గటానికి :**

మధుమేహం, రక్తపోటు వున్న వ్యక్తులు తమకు దగ్గరలో వున్న ఆవు వద్దకు వెళ్ళి దాని వీపు పైన రుద్దుతూ పది నిమిషాల పాటు వ్యాయామం చేస్తూ వున్నట్లయితే ఒక నెల రోజులలో మధుమేహం, రక్తపోటు నియంత్రణలోకి వస్తాయి. ప్రయత్నించి చూడండి. ●




## 'టెడ్ ఎక్స్' హైదరాబాద్ లలో చింతకింది మల్లేశం ఉపన్యాసం

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రతిష్ఠాత్మక 'టెడ్ ఎక్స్' సంస్థ, టెక్నాలజీ, డిజైనింగ్, ఎంటర్టైన్మెంట్ రంగాలలో విశ్వ విఖ్యాతి గాంచిన గొప్ప వారి సందేశాలను రికార్డు చేసి, వెబ్సైట్లో ఉంచుతుంది. భారత దేశంలో కూడా దీని శాఖలు ఉన్నాయి. సెప్టెంబర్25న టెడెక్స్ హైదరాబాద్ శాఖ వారు 'పల్లెసృజన' వెలుగులోకి తీసుకు వచ్చిన 'లక్ష్మి ఆసు యంత్రం' సృష్టించి అంతరించి పోతున్న 'పోచంపల్లి టై & డై' చేనేత పద్ధతికి పునరుజ్జీవింప జేసిన 'చింతకింది మల్లేశం' సందేశాన్ని రికార్డు చేయటం జరిగింది. ఇది మన తెలుగు ఇన్నోవేటర్‌కు చాలా అరుదైన గౌరవం. మల్లేశం ఉపన్యాసాన్ని విన్న వందలాది ఆహ్వానితులు మల్లేశం ఉపన్యాసం విని ముగ్దులై, ప్రోత్సాహితులయ్యారు. ఈ సందర్భంలో విశేష అతిథులుగా ఆహ్వానింపబడిన 9మంది తెలుగు ఇన్నోవేటర్లను కూడా శ్రోతలు మనసారా అభినందించారు.






చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.

## స్పందన

**బ్రిగేడియర్ గారికి,**

పల్లెసృజన పత్రిక గ్రామీణ యువతకు మరియు వ్యవసాయాన్ని చేస్తున్నటువంటి రైతులకు చాలా బాగా ఉపయోగ పడుతుంది. రసాయన వ్యవసాయం చేస్తున్న రైతులు ముఖ్యంగా వారియొక్క ఆరోగ్యాన్ని మరియు ఆదాయాన్ని పెంచేందుకు సులభమైన, అందరూ ఆచరించదగ్గ సేంద్రియ వ్యవసాయం గురించి మరియు వ్యవసాయ పనిముట్లను గురించి ప్రజానీకానికి తెలియజేస్తున్న 'పల్లెసృజన' యాజమాన్యానికి మరియు ప్రజలకు ఎంతో కొంత సాయం చేయాలన్న తపన వున్న గణేశం గారికి నా కృతజ్ఞతలు. **– కె. సత్యనారాయణ రెడ్డి, నాయుడుపల్లి, తర్లుపాడు మం., ప్రకాశం జిల్లా. ఫోన్ : 9492372183**

**సత్యనారాయణ రెడ్డి గారికి,**

దేశ ప్రజల ఆరోగ్యానికి సేంద్రియ వ్యవసాయమే సరియైన పరిష్కార మార్గం అని 'పల్లెసృజన' ఎప్పుడూ నమ్ముతుంది. ఆ విషయమే ప్రజలకి (రైతులకి) చెప్పే ప్రయత్నం చేస్తూ వుంటాము. మా యీ ప్రయత్నాన్ని అభినందించిన మీకు 'పల్లెసృజన' కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నది. **– బ్రిగేడియర్ పోగుల గణేశం**

**రాఘవ రెడ్డి గారికి,**

నమస్కారములు, వ్యవసాయ రంగంలో ఎన్నో రకాల ఇన్నోవేషన్లను, సృజనాత్మకంగా పండించే పంట రీతులను తెలియజేస్తూ కొత్తగా వ్యవసాయం చేయాలనుకుంటున్న వారికి కూడా ఎంతో ఉపయుక్తంగా ప్రచురిస్తున్న మీ వ్యాసాలు చాలా బావున్నాయి. నాదొక విన్నపము ఏమిటంటే, ఈమధ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చాలామంది తమ ఉద్యోగాలను చూసుకుంటూనే శని, ఆదివారాల్లో సేంద్రియ వ్యవసాయం చేయాలని ఒకటి – రెండు ఎకరాల పొలం తీసుకుని సాగు చేస్తున్నారు. అటువంటి వారికి వ్యవసాయం చేయవలసిన పద్ధతులను తెలియజేస్తే బావుంటుందని అనుకుంటున్నాను. **– జాజి,** గుంటూరు జిల్లా.

**జాజి గారికి,**

మన 'పల్లెసృజన' మారుమూల స్థాయి ఇన్నోవేషన్లను వెలుగులోకి తీసుకు రావటానికి ప్రయత్నించేది. ఆ పరంపరలో సృజనాత్మకంగా వ్యవసాయం చేసే వారి పద్ధతులను వివరాలను తెలియజేస్తాము. **– రాఘవ రెడ్డి,** సంపాదకవర్గ సభ్యుడు.


### FORM IV

**PALLESRUJANA R.N.I. No. APTEL 12136/01/1/2011-TC**

| | | |
|---|---|---|
| 1. | Place of publication | : Ranga Reddy Dist |
| 2. | Periodicity of its publication | : Bi-Monthly |
| 3. | Printer's Name | : Narendra Grafix |
| | Nationality | : Indian |
| | Address | : 1-1-336/53, Vivek Nagar, Chikkadpally, Hyderabad - 500 020. |
| 4. | Publisher's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : P.No.102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Ranga Reddy Dist. A.P. |
| 5. | Editor's Name | : P. Ganesham |
| | Nationality | : Indian |
| | Address | : 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : N.A. |

I, P. GANESHAM, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date 28-4-2011

Signature of Publisher


ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.

# రైతులకోసం రైతులు కనిపెట్టిన సేంద్రియ క్రిమి సంహారక మందులు

## తులసి


పంటల ఎదుగుదలకు,
వైరస్ నివారణకు
సేంద్రియ మందు
కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్
9985758013

## పర్‌ఫెక్ట్


వరిలో సుడిదోమ
పత్తి, మిరప, ఇతర కూరగాయ
పంటలను ఆశించే రసం పీల్చే పురుగు,
తెల్లదోమ, పచ్చదోమ, పిండినల్లి
మొదలైన వాటిని
సమర్థవంతంగా నివారిస్తుంది
కావలసిన వారు సంప్రదించవలసిన ఫోన్
9985758013

## సృష్టి కృషక్


పంటల
ఎదుగుదలకు,
ఆకుముడత తెగులు
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి సుదర్శన్


పంటల
ఎదుగుదలకు,
కూరగాయల పంటలలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి సర్వత్ర


పంటల ఎదుగుదలకు,
రసం పీల్చే పురుగు
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి ప్రహార్


పంటల ఎదుగుదలకు,
పిండినల్లి
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి ప్రయాస్


పంటల ఎదుగుదలకు,
పూత రాలుట
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి శక్తి

పంటల ఎదుగుదలకు
సేంద్రియ మందు

## సృష్టి శస్త్ర


పంటల ఎదుగుదలకు,
తామర పురుగు, తెల్లదోమ,
శనగపచ్చ పురుగుల
నివారణకు సేంద్రియ మందు

## సృష్టి కె& సి


పంటల ఎదుగుదలకు,
బ్యాక్టీరియా, ఫంగస్
నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి సురక్ష

పంటల ఎదుగుదలకు,
చెదల నివారణకు
సేంద్రియ మందు

## సృష్టి రక్షక్


పంటల ఎదుగుదలకు,
పత్తి పంటలో
పురుగుల నివారణకు
సేంద్రియ మందు

---

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

## 'పొదుగువాపు' వ్యాధి మందు



ప్యాకెట్‌లోని సగం పొడిని
వేడినీటిలో కలిపి
వాచిన పొదుగుకు పట్టించాలి.
రెండురోజులు వరుసగా
పొదుగుకు పట్టించినచో
పొదుగు మామూలుగా మారి
పాలు పితకడానికి వీలవుతుంది.

మీ అభిప్రాయాలను మాకు తెలపండి

**క్రియేటివ్ మైండ్స్**

ఫోన్ : 040-ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

---

కావలసిన వారు
సంప్రదించవలసిన చిరునామా :

**పల్లెసృజన**
ఇంటి నెం. 67,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500094.
ఫోన్ : 040-27111959,

---

పశువుల ఆరోగ్యం 'బోయ పెద్దరాజన్న' వైద్యం

## 'కుందా' వ్యాధి మందు

(నరాల బలహీనతతో కాళ్ళు చచ్చుపడిపోవడం)



2 వెల్లిపాయలు, 20 మిరియాలు పొడిలో కలిపి నూరి
వేడినీటిలో కలిపి ఒకరోజు ఉదయం మరియు సాయంత్రం
పశువుకు త్రాగించాలి.
ఈ ప్యాకెట్‌లోని మందు ఒకరోజు
పశువుకు త్రాగించడానికి ఉపయోగ పడుతుంది.
మీ అభిప్రాయాలను మాకు తెలపండి

**క్రియేటివ్ మైండ్స్**

ఫోన్ : 040-27111959
ఇ-మెయిల్ : creativemindsap@gmail.com

PALLESRUJANA Telugu Bi-monthly 20/- September-October 2016 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే




**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904